# క్రైమ్ THE మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
9-9-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 168

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




# తమ్ముడి కోసం పదవి త్యాగం!

మంత్రివర్గం నుంచి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఔట్

రాజగోపాల్ రెడ్డికి ఛాన్స్..నకిరేకల్ సీఎం సభతో స్పష్టం

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణలో రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీలో పరిణామాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. ఇప్పుడు క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ పై రకరకాల చర్చ మొదలైంది. ప్రధానంగా క్యాబినెట్ లోకి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని తీసుకుంటారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అందుకు తగ్గట్టు పరిణామాలు మారుతుండడం విశేషం.

ప్రస్తుతం క్యాబినెట్లో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కొనసాగుతున్నారు. ఆయనను తప్పించి తమ్ముడు రాజగోపాల్ రెడ్డి ని తీసుకుంటారని పొలిటికల్ వర్గాల్లో ప్రారంభం అయింది.

- మిగతా 2వ పేజీలో

# 'ఫామ్ హౌస్' రాజకీయం!

కెసిఆర్ నివాసం వైపు కాంగ్రెస్ దళిత ఎమ్మెల్యేల దండయాత్ర

రక్షణగా గులాబీ పార్టీ శ్రేణులు

రెండు పార్టీల మధ్య ఉద్రిక్తత

పరిస్థితిని చక్క దిద్దిన పోలీసులు




**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో**

తెలంగాణ రాజకీయం ఒక్కసారిగా హీట్ ఎక్కింది. గజ్వేల్ పరిధిలోని ఎర్రవల్లి ఫామ్ హౌస్ కేంద్రంగా మారింది. కాంగ్రెస్ దళిత ప్రజా ప్రతినిధులు కెసిఆర్ ఫాం హౌస్ ముట్టడిస్తామని బహిరంగంగా ప్రకటించారు. దీంతో శాసనసభలో

- మిగతా 2వ పేజీలో







# అడకత్తెరలో ఫిరాయింపు ఎమ్మెల్యేలు!

కాంగ్రెస్ లో కొనసాగలేరు..

గులాబీ పార్టీలో తిరిగి చేరలేరు

అధికార పార్టీలో దక్కని గౌరవం

అనుకున్నది సాధించలేక అంతర్మథనం

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో**

కాంగ్రెస్ లోకి ఫిరాయించిన గులాబీ పార్టీ ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటి? వారు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతారా? లేకుంటే తిరిగి గులాబీ గూటికి చేరుతారా? వారు వస్తే గులాబీ పార్టీ చేర్చుకుంటుందా? లేకుంటే కాంగ్రెస్ పార్టీ వారిని పూర్తిస్థాయిలో ఆదరిస్తుందా? పొలిటికల్ సర్కిల్స్లో ఇప్పుడు ఇదే చర్చ. వారు కాంగ్రెస్ పార్టీలో కొనసాగలేరు. అలాగని తిరిగి గులాబీ పార్టీలో చేరలేరు. రెండింటికి చెడ్డ రేవడిలా మారిపోయింది వారి పరిస్థితి.

- మిగతా 3వ పేజీలో

# కేసీఆర్ హత్యకు కుట్ర..

కేసీఆర్‌కు రక్షణ కల్పించాలి

బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే..

కేటీఆర్ సంచలన ఆరోపణలు

కేసీఆర్‌కు భద్రతపై పోలీసులపై నమ్మకం లేదు

మన నాయకుడు కేసీఆర్ ను మనమే కాపాడుకోవాలి

కేసీఆర్? ఫామ్?హౌస్?కు వెళ్తుండగా కేటీఆర్? అరెస్ట్?

హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ నేతల అరెస్టులు

బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద రణరంగం..

రాళ్లు, కుర్చీలతో బీఆర్ఎస్, కాంగ్రెస్ దాడులు



హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద చోటుచేసుకున్న పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. కాంగ్రెస్ నేతలు డప్పులతో ఎర్రవల్లి ఫాంహౌజ్ ముట్టడించడానికి ప్రయత్నించిన సందర్భంగా.. కేసీఆర్‌ను పరామర్శించేందుకు, ఆయనకు రక్షణగా ఎర్రవల్లికి బయలుదేరిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు..

- మిగతా 2వ పేజీలో

# తమిళనాడులో ఆ ముగ్గురు!

తెలుగు నేతలపై భారీ మైనింగ్ ఆరోపణలు

సీఎం విజయ్ సన్నిహితులు అంటూ ఉదయ్ నిధి స్టాలిన్ హాట్ కామెంట్స్

రాష్ట్ర సంపదను ఆ రెడ్ల త్రయం చేతిలో పెట్టారంటూ వ్యాఖ్యలు

# అసెంబ్లీ ఘటనపై సీఎం సీరియస్..

గడ్డం ప్రసాద్‌ను కలిసి ధైర్యం చెప్పిన రేవంత్, భట్టి

కంటతడి పెట్టిన స్పీకర్.. సభాపతి అవమానంపై ప్రభుత్వ ఆగ్రహం.. బాధ్యులపై చర్యలు

అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఘటనతో మనస్తాపానికి గురైన స్పీకర్‌ను పరామర్శించిన సీఎం, డిప్యూటీ సీఎం

సభాపతిపై వ్యక్తిగత విమర్శల తీరుపై రేవంత్ తీవ్ర విచారం

బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని ప్రసాద్‌కు హామీ

3లో

# బిఆర్ఎస్ ఎమ్మెల్సీల అరెస్ట్!

స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో..

కఠిన సెక్షన్ల కింద కేసు నమోదు

ప్రచార అస్త్రంగా మార్చుకోనున్న కాంగ్రెస్



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. విపక్ష భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి అరెస్టు అయ్యారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభం నేపథ్యంలో.. అసెంబ్లీ ప్రాంగణంలో గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై ఆ ఇద్దరు ఎమ్మెల్సీలు అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నారాయణగూడ పోలీస్ స్టేషన్ కు తరలించారు. నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. అసెంబ్లీ స్పీకర్ ఓఎస్డి ఇచ్చిన ఫిర్యాదుతో వారిపై కేసు నమోదయింది.

2లో

# ఏపీ కాంగ్రెస్ కు చికిత్స!

కొత్త ఇన్చార్జిగా పివి మోహన్

పిసిసి అధ్యక్షురాలు షర్మిల మార్పు

కేంద్ర మాజీ మంత్రి కృపారాణికి ఛాన్స్



2లో

# తెలంగాణలో మళ్లీ వైసీపీ!

కాంగ్రెస్ అసంతృప్త నేతలంతా ఆ పార్టీలోకి

బెంగళూరు నుంచి హైదరాబాద్ కు మకాం మార్చనున్న జగన్



2లో

# "నాకేం తెలియదు..

పోలీసుల ముందు నందన వాదన

వీసాల వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని విచారణలో నందన స్పష్టీకరణ

వ్యాపార లావాదేవీలు, కంపెనీ వ్యవహారాలు భర్త మధుకర్ చూసుకునేవాడని వెల్లడి

సమాధానాలు పూర్తిగా రాకపోవడంతో ఈ నెల 16న మరోసారి హాజరుకావాలని పోలీసుల ఆదేశం



క్రైమ్ మిర్రర్
తెలంగాణ
2 బుధవారం 9-9-2026

# తమ్ముడి కోసం పదవి త్యాగం!

రాజగోపాల్ రెడ్డి హాజరు.. ఇటీవల నకిరేకల్ లో సీఎం రేవంత్ పర్యటించిన సంగతి తెలిసిందే. భారీ బహిరంగ సభకు ఎన్నడూ లేని విధంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరు కావడం హాట్ టాపిక్ అవుతోంది. గతంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో సీఎం సభలకు అస్సలు హాజరయ్యే వారు కాదు రాజగోపాల్ రెడ్డి. కానీ ఇప్పుడు మంత్రి పదవి పై సంకేతాలతోనే ఆయన హాజరైనట్లు పొలిటికల్ వర్గాల్లో ఒక టాక్.. ప్రధానంగా అన్న వెంకట్ రెడ్డిని తప్పించి.. రాజగోపాల్ రెడ్డికి చాన్స్ ఇస్తారని పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తోంది. ఒకవైపు సీఎం సభకు రాజగోపాల్ రెడ్డి హాజరుకాగా.. మంత్రిగా ఉన్న వెంకట్ రెడ్డి ముఖం చాటేసారు. ఈ పరిణామాలతోనే అందరికీ ఒక స్పష్టత వచ్చింది. క్యాబినెట్లోకి తప్పకుండా రాజగోపాల్ రెడ్డిని తీసుకుంటారన్న టాక్ మొదలైంది.



**ఏఐసీసీలో ఛాన్స్..**

కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని ఏఐసీసీలో తీసుకుంటారని.. కీలక పదవి కట్టబెడతారన్న టాక్ పొలిటికల్ వర్గాల నుంచి బలంగా వినిపిస్తోంది. ఒకవేళ కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఉంచి.. రాజగోపాల్ రెడ్డిని క్యాబినెట్ లోకి తీసుకుంటే తప్పుడు సంకేతం వెళ్తుంది. ఆ ఇద్దరు సోదరులకు అవకాశం ఇస్తే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫ్యామిలీ నుంచి కూడా ఇదే డిమాండ్ వస్తుంది. ఇంకోవైపు ఉమ్మడి నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలకు ఇంతవరకు ప్రాతినిధ్యం లేదు క్యాబినెట్లో.. సామాజిక సమీకరణలతో పాటు అన్ని జిల్లాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. అందుకే ఈ పరిణామాల క్రమంలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పై వేటుకు సిద్ధపడుతున్నట్లు ప్రచారం నడుస్తోంది. అయితే తన సోదరుడి కోసం తన పదవిని వదులుకునేందుకు వెంకట్ రెడ్డి సిద్ధంగా లేరు. పైగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ నుంచి బిజెపిలోకి వెళ్లారు. వెంకట్ రెడ్డి మాత్రం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారు. మొత్తానికి అయితే తమ్ముడి కోసం అన్న పదవి త్యాగం చేయాల్సిన పరిస్థితి వచ్చింది. చివరకు ఏం జరుగుతుందో చూడాలి.

# కేసీఆర్ హత్యకు కుట్ర..

హకీంపేట వద్ద అడ్డుకుని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ సంచలన ఆరోపణలకు తెరతీశారు. కాంగ్రెస్ శ్రేణులు కేసీఆర్‌పై కుట్రపూరితంగా హత్యాయత్నానికి పాల్పడ్డాయని ఆరోపించారు. ఫామ్‌హౌస్‌కు వెళ్తున్న సమయంలో పోలీసులు కేటీఆర్‌ను అదుపులోకి తీసుకుని బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని ఆరోపించారు. కేసీఆర్ ఫాంహౌజ్ వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. అదే సమయంలో తమ సొంత నాయకుడి నివాసానికి వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. దీనిపై డీజీపీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌కు రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. పోలీసులు కాంగ్రెస్ శ్రేణులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నాయకులను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటున్నారని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ నివాసం వైపు కాంగ్రెస్ నేతలు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద వందలాది మంది పోలీసులను మోహరించామని అధికారులు చెప్పినప్పటికీ.. తమ నాయకుడి భద్రత విషయంలో పోలీసులపై నమ్మకం లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తమ నాయకుడిని తామే కాపాడుకోవాలి అంటూ బీఆర్ఎస్ నేతలు ముందుకు సాగారు. అసెంబ్లీ నుంచి కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎర్రవల్లి బయలుదేరారు. తొలుత బొల్లారం వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఆ తర్వాత హకీంపేట వద్ద కేటీఆర్, హరీశ్‌రావులను నిలిపివేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కేసీఆర్ ఇంటి వైపు వెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులకు అనుమతి ఇచ్చారా అని కేటీఆర్ పోలీసులను ప్రశ్నించారు. కేసీఆర్ నివాసం వైపు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని పోలీసులు వివరించారు. అయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు వెనక్కి తగ్గలేదు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు బొల్లారం చౌరస్తా నుంచి ఎర్రవల్లి వైపు పాదయాత్రగా బయలుదేరారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని జవహర్‌నగర్, బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్లకు తరలించారు.

# 'ఫామ్ హౌస్' రాజకీయం!

వేడి వీధుల్లోకి చేరినట్లు అయ్యింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ ను గులాబీ పార్టీ ప్రజాప్రతినిధులు అవమానించారని.. కెసిఆర్ సభకు వచ్చి క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. కాం గ్రెస్ ఎమ్మెల్యేలు, తమ అనుచరులు, కార్యకర్తలతో కలిసి ఎర్రవల్లి వైపు కదిలారు. ఒక్కసారిగా కాంగ్రెస్ నేతలు దూసుకురావడంతో ఆ ప్రాంతంలో ఒక్క సారిగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**పెద్ద ఎత్తున తరలివచ్చిన గులాబీ పార్టీ శ్రేణులు..**

మరోవైపు గులాబీ పార్టీ శ్రేణులు భారీగా తరలి వచ్చాయి ఫామ్ హౌస్ వద్దకు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల ముట్టడి పిలుపుపై సమాచారం అందుకున్న బీఆర్ఎస్ నాయకత్వం.. తక్షణమే స్పందించింది. ఫామ్ హౌస్ రక్షణ కోసం పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులను అక్కడికి తరలించింది. శాసనసభ సమావేశాల్లో పాల్గొంటున్న గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు హుటాహుటిన ఫామ్ హౌస్ వద్దకు చేరుకున్నారు. గులాబీ పార్టీ క్యాడర్ ఫామ్ హౌస్ పరిసరాల్లో మోహరించి.. కాంగ్రెస్ నిరసనకారులను అడ్డుకునేందుకు సిద్ధం కావడంతో.. రెండు ప్రధాన పార్టీల శ్రేణుల మధ్య ముఖాముఖి కోరుకు వేదిక అయింది. పరిస్థితి చేయి దాటుతుందనుకుంటున్న పోలీసులు భారీగా అక్కడకు చేరుకున్నారు. పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు.

**పోలీసుల విస్తృత తనిఖీలు..**

ఫామ్ హౌస్ దారుల్లో ఎక్కడికక్కడే పోలీసులు తనిఖీలు చేశారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను వారి అనుచరులను మార్గమధ్యమంలోనే నిలిపి వేసేందుకు పోలీసులు ప్రయత్నం చేయడంతో పలుచోట్ల తీవ్ర తోపులాటలు చోటుచేసుకున్నాయి. ప్రతిపక్ష నాయకుడి నివాసాన్ని లక్ష్యంగా చేసుకొని అధికార పార్టీ ఎమ్మెల్యేలు నిరసనలకు దిగడం ప్రజాస్వామ్య విరుద్ధమని గులాబీ పార్టీ మండిపడుతోంది. అయితే దళిత గౌరవం కోసమే తాము ప్రశ్నిస్తున్నామని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేస్తున్నారు. మంగళవారం రోజంతా తెలంగాణ రాజకీయం ఎర్రవల్లి ఫామ్ హౌస్ చుట్టూ తిరిగింది. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఆందోళన ఆ ప్రాంతంలో తీవ్ర ఉత్కంఠకు దారితీసింది.

# తమిళనాడులో ఆ ముగ్గురు!

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అతి కష్టం మీద ప్రభుత్వాన్ని నడుపుతున్నారు విజయ్. కానీ ప్రభుత్వంపై విపక్ష డిఎంకె కూటమి పట్టు బిగించాలని చూస్తోంది. ప్రధానంగా మైనింగ్ ఆరోపణలు చేస్తోంది. తమిళనాడులో మైనింగ్ మాఫియా వెనుక ఏపీ నేతలు ఉన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీఎంకే నేత ఉదయనిధి అసెంబ్లీ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి విజయ్ స్నేహితులు, సన్నిహితులైన విష్ణు రెడ్డి, సుజయ్ రెడ్డి , అనిల్ రెడ్డిలు మైనింగ్ మాఫియా నడిపిస్తున్నారని.. వారి చేతుల్లోకి మైనింగ్ కాంట్రాక్టులు ఎలా వెళ్లాయో అంటూ బయట పెట్టాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. వాటికి సంబంధించిన ఆధారాలు అన్ని బయట పెడతానని హెచ్చరించారు.

**ఆది నుంచి విమర్శలు..**

ఆది నుంచి ఏపీకి చెందిన ఈ ముగ్గురు నేతలపై విమర్శలు వస్తూనే ఉన్నాయి. ఇందులో విష్ణు రెడ్డి ప్రముఖ గ్రానైట్ వ్యాపారి. ఏపీకి చెందిన ఈయన



విజయ్కు అత్యంత సన్నిహితుడు. ఆయన రాజకీయ ప్రయాణం లో తెరవెనుక ఉండి ఆర్థిక, వ్యూహాత్మక మద్దతు అందించారు. మరోవైపు సుజయ్ రెడ్డి విజయ్ రెడ్డికి అత్యంత స్నేహితుడు. ఆయన కోర్ టీంలో సభ్యుడు. రాజకీయ వ్యూహాలలో కీలక పాత్ర పోషిస్తూ వచ్చారు. మరో సభ్యుడు అనిల్ రెడ్డి. వీరికి సమీప బంధువు కూడా. ఈ ముగ్గురు తెలుగు నేతలు విజయ్ గెలుపులో క్రియాశీలక పాత్ర పోషించారు. అందుకే ఇప్పుడు విజయ్ ప్రభుత్వం వీరికి ఆయాచిత లబ్ధి చేకూరుస్తుందనేది ఉదయనిధి చేస్తున్న ఆరోపణ.

**గట్టిగానే మైనింగ్ ఆరోపణలు..**

తమిళనాడులో ప్రధానంగా మైనింగ్ అవినీతిపై విపక్ష డీఎంకే గట్టి ఆరోపణలు చేస్తూ వస్తోంది. మంగళవారం శాసనసభలో ఇదే అంశంపై ప్రస్తావించింది. వాకౌట్ చేసిన తర్వాత బయటకు వచ్చిన ఉదయనిధి స్టాలిన్ సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మైనింగ్ గనుల లీజులు విష్ణు రెడ్డి, ఆయన బావమరిది సుజయ్ రెడ్డి, వారి వ్యాపార భాగస్వామి అనిల్ రెడ్డి చేతుల్లోకి ఎలా వెళ్లాయి? గనుల బాధ్యతలను వారికి ఎందుకు అప్పగించారు? దీనికి సంబంధించిన ఆధారాలు, పత్రాలను త్వరలోనే ఒక్కొక్కటిగా బయట పెడతాను అని ఆయన ప్రభుత్వాన్ని బహిరంగంగా హెచ్చరించారు. రాష్ట్ర సంపదను కొద్దిమంది చేతుల్లో పెట్టి దోచుకుంటున్నారని మండిపడ్డారు. కేంద్రంలోని బిజెపిని పల్లెత్తు మాట అనే ధైర్యం లేని రాష్ట్ర ప్రభుత్వం.. దొడ్డి దారిన రెడ్ల త్రయానికి రాష్ట్రాన్ని దోచిపెడుతున్నట్లు దుయ్యబట్టారు. తాము చేస్తున్న ఆరోపణలకు ధీటుగా.. మైనింగ్ వ్యవహారములు విజయ్ ప్రభుత్వ బండారాన్ని బయటపెడతామని స్పష్టం చేశారు. ఇప్పుడు తమిళ రాజకీయాల్లో ఆ ముగ్గురు తెలుగు నేతలు వివాదాలకు కేంద్ర బిందువు కావడం గమనార్హం.

# ఏపీ కాంగ్రెస్‌కు చికిత్స!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీ పై కాంగ్రెస్ దృష్టి పెట్టిందా? బలోపేతం పై ఫోకస్ చేసిందా? వచ్చే ఎన్నికల నాటికి ఓట్ల శాతం పెంచుకోవాలని చూస్తోందా? అంటే అవును అనే సమాధానం వినిపిస్తోంది. త్వరలో నాయకత్వ మార్పు ఉంటుందన్న ప్రచారం సాగుతోంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మాణిక్యం ఠాగూర్ స్థానంలో పీవీ మోహన్ నియమితులయ్యారు. దీంతో త్వరలో పిసిసి అధ్యక్షురాలిగా షర్మిల మార్పు ఉంటుందన్న ప్రచారం ప్రారంభమైంది. ఆమె స్థానంలో మరో బీసీ మహిళా నేతకు అవకాశం ఇస్తారని జోరుగా టాక్ నడుస్తోంది.

**మంచి ట్రాక్ రికార్డు..**

వరుసగా మూడు ఎన్నికల్లో ఏపీలో ఓడిపోయింది కాంగ్రెస్ పార్టీ. కనీస స్థాయిలో కూడా ఓట్లు తెచ్చుకోలేదు. ప్రతి ఎన్నికకు బలహీనపడుతూ వస్తోంది. ఈ పరిస్థితుల్లో పార్టీ కఠిన చర్యలు దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే కర్ణాటక కు చెందిన పీవీ మోహన్ ను పార్టీ ఇంచార్జ్ గా నియమించింది. ఆయనకు మంచి ట్రాక్ రికార్డు ఉంది. తెలంగాణలోనూ పార్టీని గెలిపించారు. కేరళలోనూ పార్టీ గెలుపునకు దోహదపడ్డారు. అటువంటి నాయకుడు ఇప్పుడు ఏపీకి ఇన్చార్జిగా నియమితులు కావడం మాత్రం గమనించదగ్గ విషయం.



**షర్మిల మార్పు అనివార్యం..**

2024 ఎన్నికలకు ముందు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించారు షర్మిల. ఆమె నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో బలపడ లేదు. కానీ ఏపీలో కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసిన జగన్మోహన్ రెడ్డిని మాత్రం ఆమె ఓడించగలిగారు. కానీ కాంగ్రెస్ పార్టీకి ఓటు షేరింగ్ను పెంచలేకపోయారు. అందుకే ఈసారి ఆమెను పక్కకు తప్పించి ఏఐసీసీలోకి తీసుకుంటారని టాక్ నడుస్తోంది. ప్రధానంగా కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. లేకుంటే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పీవీ హర్షకుమార్కు బాధ్యతలు కట్టబెడతారని కూడా టాక్ నడుస్తోంది. అయితే కేంద్ర మాజీ మంత్రి, ఆపై బలహీన వర్గాలకు చెందిన కిల్లి కృపారాణి వైపు హై కమాండ్ మొగ్గు చూపుతున్నట్లు టాక్ నడుస్తోంది. చివరకు ఎలాంటి నిర్ణయం ఉంటుందో చూడాలి.

# బిఆర్ఎస్ ఎమ్మెల్సీల అరెస్ట్!

**స్పీకర్ కన్నీరు..**

స్పీకర్ను ఉద్దేశించి ఏక వచనంతో సంబోధించడం, కఠిన పదజాలాన్ని ప్రయోగించడమే ఆయన అరెస్టుకు దారితీసింది. ఆయన చేసిన వ్యాఖ్యలపై స్పీకర్ ప్రసాద్ కన్నీరు సైతం పెట్టుకున్నారు. ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు మంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అమర్యాదగా మాట్లాడడాన్ని తప్పుపట్టారు. శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని మంత్రులు డిమాండ్ చేశారు. స్పీకర్ వంటి అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిపై ఓ ఎమ్మెల్సీ కఠిన పదజాలంతో మాట్లాడడం.. చట్టసభలకు గౌరవం కాదని స్వయంగా రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్నప్పటికీ.. ఆయనను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి సభ్యుడుపై ఉందన్నారు. వారిపై వివక్షపూరకంగా మాట్లాడడం, అవమానించడం సరైన కాదు అని అన్నారు.

**ప్రస్తుతం ఇద్దరి అరెస్ట్..**

ప్రస్తుతం ఇద్దరు ఎమ్మెల్సీలు అరెస్ట్ అయ్యారు. వారిపై కఠిన సెక్షన్లు నమోదు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ తో పాటు బి.ఎన్.ఎస్ లోని ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు



చేసినట్లు చెబుతున్నారు. అసెంబ్లీ వద్ద ఆందోళనకు దిగిన భారత రాష్ట్ర సమితి సభ్యులు కేటీఆర్, హరీష్ రావు, సుధీర్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి ల పైన కూడా కేసులు నమోదు చేశారు. సిసి ఫుటేజ్ ఆధారంగా సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో వారిపై ఈ కేసులు నమోదయ్యాయి. ప్రతిపక్షం సభా బహిష్కరణలు, గేట్ల వద్ద ధర్నాల వ్యూహాన్ని తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ పార్టీకి తాతా మధు చేసిన వ్యాఖ్యలు బలమైన రాజకీయ అస్త్రంగా మారాయి. చట్టసభలను, స్పీకర్ పీఠాన్ని భారత రాష్ట్ర సమితి నేతలు ఏ స్థాయిలో అవమానిస్తున్నారు ప్రజలకు వివరించేందుకు కాంగ్రెస్ గట్టిగానే ప్రణాళిక రచించింది. ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు నిర్ణయించింది.

# "నాకేం తెలియదు..

ఈ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని, సంబంధిత వ్యాపార కార్యకలాపాలన్నింటినీ తన భర్త మధుకర్ మాత్రమే పర్యవేక్షించేవారని చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు. సుమారు నాలుగు గంటలపాటు నందనను అధికారులు ప్రశ్నించారు. కేసుకు సంబంధించిన పలు అంశాలపై వివరణ కోరగా, అనేక ప్రశ్నలకు తనకు సమాచారం లేదనే సమాధానం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో ఇంకా స్పష్టత రావాల్సిన అంశాలు ఉండటంతో ఈ నెల 16న మళ్లీ విచారణకు రావాలని ఆమెకు నోటీసులు అందజేశారు.

**కంపెనీ వ్యవహారాలతో సంబంధం లేదన్న నందన**

తాను ఐటీ ఉద్యోగంతో పాటు యూట్యూబ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నానని నందన విచారణ సందర్భంగా పేర్కొన్నట్లు సమాచారం. వీసా కన్సల్టెన్సీ సంస్థతో తనకు ఎలాంటి అనుబంధం లేదని, ఆ సంస్థలో తాను డైరెక్టర్‌గా కానీ, సిబ్బందిలో భాగంగా కానీ లేనని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. వీసాల ప్రక్రియ, ఖాతాలకు సంబంధించిన లావాదేవీలు, వినియోగదారుల నుంచి డబ్బు తీసుకోవడం వంటి వ్యవహారాలన్నీ తన భర్త మధుకర్ ఆధ్వర్యంలోనే జరిగేవని ఆమె వివరించినట్లు తెలుస్తోంది.

**మధుకర్ చుట్టూ దర్యాప్తు**

ఫిర్యాదుదారులు సమర్పించిన ఫిర్యాదులో నందనతో పాటు ఆమె భర్త మధుకర్, మామగారి పేర్లు కూడా ఉన్నాయని పోలీసులు తెలిపారు. నందన తన వాంగ్మూలంలో భర్తే వ్యవహారాలను నిర్వహించేవారని చెప్పడంతో దర్యాప్తు అధికారులు మధుకర్ పాత్రపైనా మరింత దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మధుకర్ విదేశాల్లో ఉన్నట్లు సమాచారం. తాను విచారణకు హాజరైన తర్వాత ఆయనను భారత్‌కు పంపిస్తానని నందన చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు.

# డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం చేస్తున్నది

## పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్

అమరావతి: టీడీపీ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్నది 100 శాతం దుష్ప్రచారమేనని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ ఈ తరహా డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపిందని ఆయన ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువ నుంచి నీటిని విడుదల చేయడంతో రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో తమ ఓటు బ్యాంకుకు నష్టం జరుగుతుందనే భయం వైసీపీని వెంటాడుతోందని బోడే ప్రసాద్ అన్నారు. అందుకే ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ భుజానికెత్తుకున్నారని విమర్శించారు. డీఎస్సీలో మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులపై కూడా అక్రమాలు జరిగాయంటూ ఒక పత్రికను అడ్డుపెట్టుకుని విష ప్రచారం చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తన నియోజకవర్గంలోని ఇద్దరు అక్కాచెల్లెళ్ల ఉదంతాన్ని ఆయన ఉదహరించారు. సొంత ఇల్లు కూడా లేక అద్దె ఇంట్లో ఉంటున్న ఆ యువతులు కష్టపడి చదివి డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారని, వారిలో ఒకరు 2019లో కేవలం ఒక్క మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయారని తెలిపారు. ఐదేళ్ల తర్వాత వారి కల నెరవేరితే, వారి మెరిట్‌ను కూడా ప్రశ్నిస్తూ వైసీపీ నేతలు అవమానించడం బాధాకరమన్నారు. ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వారు గతంలో యువత జీవితాలతో ఆడుకున్నారని ఆరోపించారు.

# అడకత్తెరలో ఫిరాయింపు ఎమ్మెల్యేలు!

**పదిమంది ఎమ్మెల్యేల ఫిరాయింపు..**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. గులాబీ పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా మారింది. అయితే పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత ఎమ్మెల్యేలు దానం నాగేందర్,కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెల్లం వెంకట్రావ్, సంజయ్ కుమార్, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,మహిపాల్ రెడ్డి, కాలే యాదయ్య కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. వారితో పాటు ఎమ్మెల్సీలు బొగ్గారాపు దయానంద్, దండే విఠల్, ప్రభాకర్ రావు, మల్లేశం తదితరులు కాంగ్రెస్లో చేరిపోయారు. ఇందులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ మారిన అనంతరం సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా కూడా కాంగ్రెస్ తరపున పోటీ చేయడం విశేషం.

**విభేదాల పర్వం..**

కాంగ్రెస్ పార్టీలో పరిస్థితి నివురు గప్పిన నిప్పులా మారింది. ఇప్పటికే ఉన్న పాత నేతల కు కొత్తగా చేరిన




వారితో పడడం లేదు. ఈ క్రమంలో గూడెం మహిపాల్ రెడ్డి తిరిగి యు టర్న్ తీసుకున్నారు. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ పార్టీ బలపరిచిన అభ్యర్థికి మద్దతుగా పనిచేశారు. మొన్న ఫామ్ హౌస్ లో కేసీఆర్ నిర్వహించిన అత్యవసర సమావేశానికి సైతం హాజరయ్యారు. దీంతో మిగతా వారి పరిస్థితి ఏంటి అనే చర్చ నడిచింది. సీనియర్ నేత పోచారం శ్రీనివాస్ రెడ్డి, దానం నాగేందర్ లాంటివారు కేసిఆర్ కు అనుకూల ప్రకటనలు చేశారు. ఏ ఉద్దేశ్యంతో కాంగ్రెస్ పార్టీలో చేరారో.. ఆ పని జరగడం లేదు. మరోవైపు చూస్తే కాంగ్రెస్ పార్టీ పరిస్థితి దిగజారుతోంది. ఈ పరిస్థితుల్లో ఆ పార్టీలో ఉండడం కంటే.. తిరిగి గులాబీ పార్టీలో చేరిపోవడమే మంచిది అన్న అభిప్రాయానికి చాలామంది వస్తున్నారు.

**బిఆర్ఎస్ డోర్స్ క్లోజ్..**

మరోవైపు పార్టీ కష్ట కాలంలో ఉండగా బయటకు వెళ్లిపోయిన నేతలను తిరిగి చేర్చుకునే అవకాశం లేదు అని గులాబీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లో వారిని చేర్చుకునేది లేదు అని ఆ పార్టీలో కొంతమంది నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. కానీ పరిస్థితులకు అనుగుణంగా కొంతమంది సీనియర్లు వెళ్లక తప్పదు. అటువంటివారు తిరిగి వస్తామంటే మాత్రం ఆలోచించుకునే పరిస్థితి గులాబీ పార్టీలో ఉంది. అయితే ఎన్నికలకు ఏడాది ముందు అలా వెళ్ళిన వారిని తిరిగి చేర్చుకొని.. కాంగ్రెస్ పార్టీని వ్యూహాత్మకంగా దెబ్బతీయాలన్నది గులాబీ పార్టీ ఆలోచన. చూడాలి చివరకు ఏం జరుగుతుందో..

# అసెంబ్లీ ఘటనపై సీఎం సీరియస్..

హైదరాబాద్: అసెంబ్లీ పరిసరాల్లో సోమవారం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం మంగళవారం సభాపతి గడ్డం ప్రసాద్కుమార్పై తీవ్రంగా కనిపించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆయనను కలిసి పరామర్శించారు. స్పీకర్ ఛాంబర్కు వెళ్లిన ఇద్దరు నేతలు.. గత రోజు చోటుచేసుకున్న పరిణామాలపై ప్రసాద్కుమార్తో మాట్లాడి ధైర్యం చెప్పారు. సభాపతిపై వ్యక్తిగత స్థాయిలో చేసిన వ్యాఖ్యలు, దూషణలు తీవ్రంగా బాధించాయని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిని అవమానించేలా వ్యవహరించడం సరికాదని సీఎం అభిప్రాయపడినట్లు సమాచారం. ఈ క్రమంలో స్పీకర్ ఆవేదనకు రేవంత్రెడ్డి స్పందించి, జరిగిన పరిణామాలపై విచారం వ్యక్తం చేశారు. సోమవారం అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పోలీసులకు మధ్య చోటుచేసుకున్న పరిణామాలపై ప్రభుత్వం ఇప్పటికే తీవ్రంగా స్పందించింది. విధుల్లో ఉన్న అధికారులు, ముఖ్యంగా మహిళా సిబ్బంది పట్ల అనుచిత ప్రవర్తన జరిగిందన్న ఆరోపణలు కూడా వెలువడ్డాయి. ఈ అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నట్లు సీఎం స్పష్టం చేశారు. మీడియాలో ప్రసారమైన స్పీకర్ ఆవేదనకు సంబంధించిన దృశ్యాలు కూడా సీఎం దృష్టికి వెళ్లాయి. వ్యక్తిగత విమర్శలతో ప్రసాద్కుమార్ భావోద్వేగానికి గురైన తీరు రేవంత్రెడ్డిని కలచివేసినట్లు తెలుస్తోంది. ఈ తరహా ఘటనలు మరోసారి చోటుచేసుకోకుండా సభా మర్యాదలు, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. సభాపతికి ప్రభుత్వం పూర్తి మద్దతుగా ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. అసెంబ్లీ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన వారిపై నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాజ్యాంగబద్ధమైన పదవుల గౌరవాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని రేవంత్రెడ్డి స్పష్టం చేసినట్లు తెలిసింది.




## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా విద్యార్థుల పదవి ప్రధానోత్సవ కార్యక్రమం.

**భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 08:** భద్రాచలం పట్టణం చర్ల రోడ్డు లో గల శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థుల క్యాబినెట్ ఎన్నికలు నిర్వహించారు. అనంతరం పదవి ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన క్యాబినెట్ ఎన్నికల్లో వివిధ హోదాలకు ఎంపికైన విద్యార్థులకు క్యాబినెట్ హోదాలను అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు బాధ్యతలు, నాయకత్వ లక్షణాలు మరియు పాఠశాల పట్ల వారి కర్తవ్యాలను వివరించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల మిస్టర్ బి. గోపాల్, స్కూల్ ఏజీఎం వీరన్న గ ఉపాధ్యాయులు మరియు వ్యాయామ ఉపాధ్యాయులు కిషోర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులకు ప్రమాణ స్వీకారం చేయించి, వారికి నాయకత్వ బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బి. గోపాల్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే క్యాబినెట్ వ్యవస్థ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు తమకు అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో, నిజాయితీతో నిర్వర్తించాలని సూచించారు.

## ఆటో డ్రైవర్ కుమార్తె డాక్టర్గా..

**కష్టాలను అధిగమించి ఎంబీబీఎస్ సీటు సాధించిన షేక్ సనా**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** పేదరికం చదువుకు అడ్డంకి కాదని, పట్టుదలతో లక్ష్యాన్ని సాధించవచ్చని నిరూపించింది ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన షేక్ సనా సాధారణ ఆటో డ్రైవర్ కుటుంబం నుంచి వచ్చిన ఆమె నీట్లో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్లో సీటు సాధించి స్ఫూర్తిగా నిలిచింది. సనా తండ్రి షేక్ యూసుఫ్ ఆటో డ్రైవర్గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పరిమిత ఆదాయంతో కుటుంబ అవసరాలను తీర్చుకుంటూనే తన పిల్లల చదువుకు ఎలాంటి లోటు రాకుండా చూసుకున్నారు. తండ్రి పడుతున్న కష్టాన్ని స్ఫూర్తిగా తీసుకున్న సనా వైద్యురాలిగా ఎదగాలనే లక్ష్యంతో కష్టపడి చదివి నీట్లో మంచి ప్రతిభ కనబరిచింది. కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం కౌన్సెలింగ్లో భాగంగా హైదరాబాద్లోని షాదాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్లో సనాకు ఎంబీబీఎస్ సీటు లభించింది. అయితే వైద్య విద్యకు అవసరమైన భారీ ఫీజులు చెల్లించడం ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థికంగా భారంగా మారింది. ఈ పరిస్థితిని గుర్తించిన షాదాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మేనేజింగ్ డైరెక్టర్ సారిబ్ రసూల్ ఖాన్ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చారు. సనా ప్రతిభను, ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితిని గుర్తించి ఉచితంగా వైద్య విద్యను అందించేందుకు సహకరించారు. ఈ సందర్భంగా అడ్మిషన్ కమిటీ సభ్యుడు అబ్దుల్ మాజిద్ సనా కుటుంబానికి ఫీజు రుసుముకు సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సహకారం సనా కుటుంబానికి ఎంతో భరోసానిచ్చింది. పేదరికాన్ని అధిగమించి వైద్య విద్యలో అడుగుపెట్టిన షేక్ సనా ప్రయాణం ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ప్రతిభ, పట్టుదల, కృషికి తోడు సమాజం నుంచి ప్రోత్సాహం లభిస్తే ఆర్థిక పరిస్థితులు ఎన్ని ప్రతికూలంగా ఉన్నా లక్ష్యాలను సాధించవచ్చని ఆమె విజయం చాటిచెబుతోంది.

## భద్రాద్రి జిల్లా టూరిజం నోడల్ అధికారిణిగా అనూష

**ఉత్తర్వులు విడుదల చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్.**

**భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 08:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టూరిజం నోడల్ అధికారిణిగా జిల్లా పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న గ్రూప్ - 1 అధికారిణి అనూషకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ సెక్రటరీ నిర్వహించిన సమావేశంలో పర్యాటక రంగం అభివృద్ధి చేయాలనే సంకల్పంతో భద్రాద్రి జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి కోసం అనుష ను నియమించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రాంతాలను గుర్తించి, ప్రణాళికలు రూపొందించి, వాటి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందిస్తూ పర్యాటక అభివృద్ధికి నోడల్ అధికారి పనిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు .



# తెలంగాణలో మళ్లీ వైసీపీ!

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** తెలంగాణలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యాక్టివ్ కానుందా? అందుకు సంబంధించి గ్రౌండ్ వర్క్ ప్రిపేర్ అవుతోందా? కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తులంతా ఆ పార్టీలో చేరుతారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. తమంత వైయస్ రాజశేఖర్ రెడ్డి కి వారసులం అంటూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రకటన వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు కాంగ్రెస్ పార్టీలో రేవంత్ తో విభేదించే నేతలంతా ఇప్పుడు వైసీపీ వైపు చూస్తున్నట్లు పొలిటికల్ వర్గాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఒక సెక్షన్ మీడియా కూడా దీనిపైనే పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది.

**2014 ఎన్నికల్లో పోటీ..**

ఉమ్మడి రాష్ట్రంలోనే పురుడు పోసుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. 2014 ఎన్నికల్లో తెలంగాణలోనూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోటీ చేసింది. కానీ కనీస స్థాయిలో కూడా సీట్లు రాకపోవడంతో.. గెలిచిన కొద్దిమందిని కెసిఆర్ తెలంగాణ రాష్ట్ర సమితిలోకి పంపించారు జగన్మోహన్ రెడ్డి. తెలంగాణలో ఇక వైసిపి ఉండదని ప్రకటించారు. కెసిఆర్ తో ఉన్న స్నేహంతో తెలంగాణలో రాజకీయాలు మానుకున్నారు. గత పుష్కర కాలంగా కెసిఆర్, జగన్మోహన్ రెడ్డి రాజకీయ మిత్రులుగా కొనసాగుతున్నారు. ఒకరి ప్రయోజనాలకు



ఒకరు పాటుపడుతూ వచ్చారు.

**సీనియర్లలో అసంతృప్తి..**

తెలంగాణలో విచిత్ర వాతావరణం కొనసాగుతోంది. కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పై సీనియర్లు ఆగ్రహంగా ఉన్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన రేవంత్ ముఖ్యమంత్రి పదవి అధిరోహించడంపై సహజంగానే వారికి కోపం ఉంది. ఆపై రేవంత్ ఏపీ సీఎం చంద్రబాబుతో స్నేహంగా కొనసాగుతున్నారు. అది ఎంత మాత్రం వారికి రుచించడం లేదు. అదే సమయంలో జగన్మోహన్ రెడ్డి ఇప్పటికీ కేసీఆర్ తో స్నేహం పాటిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో రేవంతును విభేదించే కాంగ్రెస్ నాయకులకు ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. అలాగని వారు కేసీఆర్ పార్టీలోకి వెళ్ళలేరు. అందుకే జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని తెలంగాణలో యాక్టివ్ చేస్తే చేరాలన్న భావనలో ఎక్కువ మంది ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి పదవి రాలేదన్న బాధతో ఉన్నారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. కొంతమంది సీనియర్ మంత్రులు సైతం అసంతృప్తితో ఉన్నారు. మొన్న ఆ మధ్యన 20 మంది ఎమ్మెల్యేల తో కలిసి రాజగోపాల్ రెడ్డి సమావేశం అయినట్లు కూడా వార్తలు వచ్చాయి. సరిగ్గా ఆ సమయంలోనే తామంతా రాజశేఖర్ రెడ్డి వారసులం అని ప్రకటించారు రాజగోపాల్ రెడ్డి.

### హైదరాబాద్ కు షిఫ్ట్..

వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇకనుంచి హైదరాబాదు నుంచి రాజకీయ కార్యకలాపాలు చేయాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇది కూడా తెలంగాణలో పార్టీ యాక్టివ్ అవుతాదన్న ప్రచారానికి ఊతం ఇస్తోంది. దాదాపు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలంతా హైదరాబాద్ నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నారు. సాటి తెలుగు రాష్ట్రంగా హైదరాబాదులో ఉంటేనే బాగుంటుందన్న అభిప్రాయానికి జగన్ వచ్చారు. సెంటిమెంట్ దృష్ట్యా భాగ్య నగరానికి మకాం మార్చాలని నిర్ణయానికి వచ్చారు. అందుకే తెలంగాణలో ఆ పార్టీ యాక్టివ్ అవుతుందన్న ప్రచారానికి మరింత బలం చేకూరింది. చూడాలి మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో..




## శాంతియుత నిరసనపై కాంగ్రెస్ దౌర్జన్యకాండ!

**మా కార్యకర్తలపై దాడులు చేశారు.. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**పటాన్చెరు పోలీసులకు బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు**

**పటాన్చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 08:** శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహిస్తుండగా కాంగ్రెస్ నాయకులు తమ కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు పటాన్చెరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం సాయంత్రం బీఆర్ఎస్ నాయకుల బృందం పటాన్చెరు సీఐ రవీందర్ను కలిసి ఫిర్యాదు చేసింది. శాసనసభ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దాడిని నిరసిస్తూ పటాన్చెరు పట్టణంలో శాంతియుతంగా నిరసన చేపట్టామని నాయకులు తెలిపారు. అదే సమయంలో కాంగ్రెస్ నాయకులు తమ కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో కార్యకర్తలను ఉసిగొల్పి దాడులు చేయించారని వారు ఆరోపించారు. దాడుల్లో పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు గాయపడ్డారని పేర్కొంటూ, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన కాంగ్రెస్ కార్యకర్తలను వెంటనే అరెస్టు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పరమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.






నేటి యుగంలో ఎఐకి ఆదరణ బాగా పెరింగిందని చెప్పుకోవాలి. ప్రతీ సంస్థ దాదాపు ఎఐపై ఆధారపడటం మేడలు పెట్టాయి. ఆ దిశగా భారతదేశంలో 2024-2026 మధ్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంబంధిత ఉద్యోగాల జీతాలు 23 శాతం పెరిగాయని, అదే సమయంలో కొన్ని సాంప్రదాయ టెక్నాలజీ ఉద్యోగాల జీతాలు తగ్గాయని, ఇది ఉద్యోగ మార్కెట్‌లో వేతన వ్యత్యాసాన్ని పెంచుతోందని తెలిపింది. జాబ్స్ ప్లాట్‌ఫామ్ ఫౌండిట్ విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం, గత సంవత్సరం ఏఐ రంగం వార్షిక ప్రాతిపదికన 12 శాతం జీతాల వృద్ధిని నమోదు చేసింది. ఇది పరిశీలించిన విభాగాలలో అత్యధికం. దీని తర్వాతి స్థానాల్లో కంప్యూటర్ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ- సెమీకండక్టర్స్ చెరో 9 శాతం వృద్ధిని నమోదు చేశాయి.

గత రెండేళ్లుగా కంప్యూటర్ హార్డ్‌వేర్ మరియు ఇ-కామర్స్ వంటి రంగాలలో జీతాలు తగ్గుముఖం పట్టగా, ఐటీ సేవల రంగంలో జీతాలు స్తంభించిపోయాయని నివేదిక పేర్కొంది. 0-3 సంవత్సరాల అనుభవం ఉన్న

## ఏఐకి పెరిగిన ఆదరణ

ఎంట్రీ-లెవల్ ఏఐ నిపుణులు సంవత్సరానికి రూ. 8.87-15.41 సంపాదిస్తుండగా, 15 సంవత్సరాల కంటే ఎక్కువ అనుభవం ఉన్నవారికి ఇది రూ. 70.99-89.24 లక్షల వరకు పెరుగుతుంది. ఏఐ వేతనాలు ప్రాంతాన్ని బట్టి గణనీయంగా మారుతూ ఉంటాయి. ఇది ప్రత్యేక నైపుణ్యం ఉన్న యజమానులు, పరిణతి చెందిన టెక్నాలజీ ఎకోసిస్టమ్‌లు ఎక్కడ కేంద్రీకృతమై ఉన్నాయో ప్రతిబింబిస్తుంది. ఉత్పత్తి సంస్థలు, ఏఐ-కేంద్రీకృత స్టార్టప్‌లు, ప్రపంచ సామర్థ్య కేంద్రాల సాంద్రత కారణంగా, బెంగళూరు భారతదేశంలో అత్యధిక వేతనాలు ఇచ్చే మార్కెట్‌గా కొనసాగుతోంది. బెంగళూరులో సీనియర్ ఏఐ నిపుణులు సంవత్సరానికి రూ. 61.70-91.25 లక్షలు సంపాదిస్తున్నారు. ఇది ఎన్‌సిఆర్ లేదా ముంబై కంటే సుమారు 10-15 శాతం ఎక్కువ, సీనియర్ స్థాయిలో చెన్నై కంటే 40 శాతం వరకు అధికం. విస్తరిస్తున్న జిసిసి, ఉత్పత్తి ఇంజనీరింగ్ పెట్టుబడుల మద్దతుతో హైదరాబాద్ దీనికి గట్టి పోటీదారుగా ఎదుగుతోంది. సైబర్‌సెక్యూరిటీ రంగంలో గరిష్ట వేతన పరిమితి సంవత్సరానికి రూ. 97.81 లక్షలు, ఇది పరిశీలించిన అన్ని విభాగాలలోకెల్లా అత్యధికమని నివేదిక పేర్కొంది. దీనికి విరుద్ధంగా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ- ఐటి సర్వీసెస్‌లో ప్రారంభ వేతనం సంవత్సరానికి రూ. 2.68-5.08 లక్షలతో మొదలై, 15 ఏళ్లకు పైబడిన వారికి సంవత్సరానికి రూ. 57.55--72.13 లక్షలకు చేరుకుంటుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ రెండు విభాగాలలోనూ వేతనాల్లో 1 శాతం తగ్గుదల నమోదైంది. కంపెనీలు దేనికి అధిక వేతనం చెల్లించాలనే విషయంలో ఎంపిక చేసుకుంటున్నాయి. కేవలం అనుభవం మాత్రమే ఇకపై అత్యధిక జీతాల పెంపును అందించడం లేదు. ఒక నైపుణ్యం వ్యాపారానికి అవసరమైన సామర్థ్య లోపాన్ని పూరిస్తుందా లేదా అన్నదే ముఖ్యం. అది ఏఐ వ్యవస్థలను నిర్మించడం, మౌలిక సదుపాయాలను భద్రపరచడం, ఫ్యాక్టరీలను ఆటోమేట్ చేయడం లేదా ప్రత్యేకమైన ఆరోగ్య సంరక్షణను అందించడం వంటివి కావచ్చునని ఫౌండిట్ సీఈఓ తరుణ్ సిన్హా అన్నారు. వ్యాపార అవసరాలు మారుతున్న కొద్దీ, తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ, నవీకరించుకునే వారి జీతాలు కూడా క్రమంగా పెరుగుతాయని నిపుణులు అర్థం చేసుకోవాలని సిన్హా అన్నారు. టెక్నాలజీ రంగం వెలుపల జీతాల పెరుగుదల, కొత్త సామర్థ్యాలను పెంపొందించుకునే రంగాలలో కేంద్రీకృతమై ఉంది. గత రెండేళ్లలో, సెమీకండక్టర్ల రంగంలో 17 శాతం (మొదట 7 శాతం, ఆ తర్వాత 9 శాతం), ఇండస్ట్రియల్ ఆటోమేషన్ రంగంలో 13 శాతం (మొదట 5 శాతం, ఆ తర్వాత 8 శాతం) జీతాలు పెరిగాయి. ఈ రెండూ గత రెండేళ్లలో మరింత వేగవంతమయ్యాయి. ఇండస్ట్రియల్ ఆటోమేషన్‌లో సీనియర్ జీతాలు రూ. 58.90 లక్షల వార్షిక ప్యాకేజీకి, సెమీకండక్టర్లలో రూ. 48.49 లక్షల వార్షిక ప్యాకేజీకి చేరుకున్నాయి. గత ఏడాది ఆటోమోటివ్ రంగం 6 శాతం వృద్ధిని నమోదు చేసింది. మెడికల్ ప్రాక్టీస్ రంగంలో 8 శాతం జీతాల పెరుగుదల, సీనియర్ జీతాలు రూ. 56.70 లక్షల వార్షిక ప్యాకేజీకి చేరాయి. దీని తర్వాత మెడికల్ డివైసెస్ రంగంలో 6 శాతం, ఫార్మాస్యూటికల్స్ రంగంలో 4 శాతం వృద్ధి నమోదైంది. ఇక ఇదే కోణంలో ఎఐ కి ఆదరణ పెరిగితే ఆ రంగంలో రాణించే నిపుణులకు తిరుగుండదనేది నిపుణుల వాదన.



# నిజం మాట్లాడితే నిలవనీయరా?

**సమాజంలో నేడు మనం ఎదుర్కొంటున్న అనేక సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలకు మూలకారణం ఏమిటని ఒక్క క్షణం ఆలోచిస్తే ఒక లోతైన మానసిక సత్యం స్పష్టంగా కనిపిస్తుంది. మనస్సాక్షిని తట్టి అడిగితే వినిపించే ఆ చేదు నిజమే సత్యాన్ని అణచివేయడం. నిజాన్ని దాచిపెట్టడం, వాస్తవాలను వక్రీకరించడం, ప్రశ్నించే గొంతుకలను నొక్కేయడం వంటి చర్యలే నేటి సామాజిక అశాంతికి ప్రధాన పునాదులు.**

భయం, స్వార్థం, అహంకారం వంటి మలినాలు మనస్సును ఆవహించినప్పుడు సత్యం బలైపోతుంది. అది ఒక చిన్న అబద్ధంగానో లేదా మౌనంగానో మొదలై, కాలక్రమేణా మొత్తం వ్యవస్థను కబళించే ఒక విపత్తుగా మారుతుంది. సత్యాన్ని తొక్కిపెట్టడం అనేది కేవలం ఒక అబద్ధం చెప్పడం మాత్రమే కాదు, అది నేడు ఒక వ్యవస్థీకృత నేరంగా పరిణమించింది. అధికార బలమున్నవారు, ధనవంతులు తమకు వ్యతిరేకంగా వచ్చే వాస్తవాలను అణచివేయడానికి అధికారాన్ని వాడుతూ బలహీనుల స్వరాలను నొక్కేస్తున్నారు. నిజాన్ని నిర్భయంగా చెప్పేవారిని సమాజం నుండి వెలివేయడం, వారిపై రకరకాల ముద్రలు వేసి ఒంటరిని చేయడం నిత్యకృత్యమైంది.

కుటుంబ వ్యవస్థ నుండి మొదలుకొని అంతర్జాతీయ వేదికల వరకు ఈ దురదృష్టకర ధోరణి కనిపిస్తుంది. కుటుంబంలో పెద్ద వ్యక్తి తప్పు చేసినప్పుడు గౌరవం పోతుందనే నెపంతో చిన్నవారిని మౌనంగా ఉండమని ఒత్తిడి చేస్తారు. కార్యాలయాల్లో ఉన్నతాధికారుల అవినీతిని ప్రశ్నిస్తే ఉద్యోగం ఊడుతుందనే భయం సత్యం గొంతు నొక్కుతుంది. రాజకీయాల్లో అయితే ప్రజల దృష్టిని మళ్లించడానికి అసలు సమస్యలను పక్కన పెట్టి, భావోద్వేగాలను రెచ్చగొట్టడం ద్వారా నిజాన్ని కప్పిపుచ్చుతారు. సత్యం అణచివేతకు భయం, స్వార్థం అనే రెండు ప్రధాన శక్తులు చోదకాల్లా పనిచేస్తున్నాయి. పర్యవసానాలకు భయపడి మనం వహించే మౌనం తాత్కాలికంగా రక్షణ ఇస్తుందేమో కానీ, దీర్ఘకాలికంగా పెద్ద ప్రమాదానికి దారితీస్తుంది. స్వార్థంతో కూడిన నిర్ణయాలు పరస్పర విశ్వాసమనే సమాజ పునాదిని కదిలించివేస్తాయి. నమ్మకం లేని సమాజం కేవలం భయం మీద మాత్రమే నడుస్తుంది, అది ఎంతో కాలం నిలబడలేదు. చరిత్ర పుటలను తిరగేస్తే సత్యాన్ని అణచివేసిన ప్రతిసారీ మానవాళి భారీ మూల్యాన్ని చెల్లించుకున్నట్లు స్పష్టమవుతుంది. 1986లో జరిగిన చెర్నోబిల్ అణు విపత్తు దీనికి ఒక నిలువెత్తు సాక్ష్యం. అప్పటి ప్రభుత్వం తన వైఫల్యాన్ని దాచిపెట్టడానికి ప్రయత్నించడం వల్లే వేలాది మంది ప్రజలు ప్రాణాపాయ స్థితికి చేరుకున్నారు. అదేవిధంగా మన దేశంలో భోపాల్ గ్యాస్ దురంతం వెనుక కూడా రక్షణ ప్రమాణాల లోపాన్ని, వాస్తవాలను లాభాల కోసం తొక్కిపెట్టడమే ఉందనేది జగమెరిగిన సత్యం. సత్యాన్ని దాచడం వల్ల కలిగే లాభం క్షణికం, కానీ నష్టం శాశ్వతం అని ఈ సంఘటనలు హెచ్చరిస్తున్నాయి. అయితే చీకటి ఎంత దట్టంగా ఉన్నా సత్యం అనే చిన్న కిరణం దాన్ని ఛేదించగలదు. మహాత్మా గాంధీ సత్యాన్ని అహింసాత్మక ఆయుధంగా మలిస్తే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సమాజంలో పాతుకుపోయిన కులవివక్ష అనే చేదు సత్యాన్ని నిర్భయంగా బయటపెట్టి కోట్ల మంది జీవితాల్లో వెలుగులు నింపారు. సత్యం అణచివేతను అడ్డుకోవాలంటే వ్యవస్థాగత మార్పులతో పాటు వ్యక్తిగత బాధ్యత పెరగాలి. ప్రతి మనిషి తన పరిధిలో నిజం మాట్లాడటం నేర్చుకోవాలి. ఆర్టీఐ వంటి చట్టాలను విరివిగా ఉపయోగిస్తూ ప్రభుత్వాలు, సంస్థల్లో పారదర్శకతను పెంచాలి. మన విద్యా వ్యవస్థ మార్కుల కోసం కాకుండా పిల్లల్లో ప్రశ్నించే తత్వాన్ని, నైతికతను పెంపొందించాలి. సమాజానికి ఐదో వేదం లాంటి మీడియా వ్యాపార ప్రయోజనాలను పక్కన పెట్టి నిష్పక్షపాతంగా వార్తలను అందించాలి. సోషల్ మీడియా యుగంలో ఏదైనా వార్తను ప్రచారం చేసే ముందు అది నిజమో కాదో నిర్ధారించుకోవడం ప్రతి పౌరుడి కనీస ధర్మం. సత్యం అనేది సూర్యుడి లాంటిది, మేఘాలు కొద్దిసేపు దాన్ని కప్పి ఉంచవచ్చు కానీ అది ఎప్పటికీ ఆరిపోదు. భవిష్యత్తు తరాలకు మనం ఇచ్చే గొప్ప ఆస్తి ధనం కాదు, నిజాయితీతో కూడిన వ్యవస్థ మాత్రమే. సత్యం ఉన్నచోటనే శాంతి, ప్రగతి సాధ్యమవుతాయని గ్రహించి మనందరం నవ సమాజ నిర్మాణానికి అడుగులు వేయాలి.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# రైలు ప్రయాణం మెరుగుపడేదెప్పుడు?

**సామాన్య ప్రజలు ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లను రద్దుచేయడం, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్ రిజర్వ్‌డ్ బోగీల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల స్లీపర్ క్లోచ్‌లలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బోగీలలో కెపాసిటీకి మించిన ప్రయాణికులు ఉండటం వలన టాయిలెట్ ఉపయోగం ఎక్కువ.**

**భారతీయ ఆర్థికవ్యవస్థకు రైల్వే విభాగం జీవనాడి వంటిది. ఏటా రైలు ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ దానికి తగ్గట్టుగా మౌలిక సదుపాయాల కల్పన పెరగటం లేదు. ప్రతి రోజూ లక్షలాది మంది ప్రయాణికులు తమ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. మెట్రో నగరాల్లో రైల్వే బ్రిడ్జిలు రద్దీగా ఉండి ప్లాట్‌ఫాం మొదలు నుంచి చివరి వరకు చేరుకునేందుకు కనీసం 15 నిమిషాలు పడుతున్నది. రద్దీ సమయాల్లో లిఫ్టులు, ఎస్కలేటర్లు పనిచేయక పోవడం నిత్యకృత్యం.**




సామాన్య ప్రజలు ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లను రద్దుచేయడం, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్ రిజర్వ్‌డ్ బోగీల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల స్లీపర్ క్లోచ్‌లలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బోగీలలో కెపాసిటీకి మించిన ప్రయాణికులు ఉండటం వలన టాయిలెట్ ఉపయోగం ఎక్కువ. మూత్రశాలల్లో నీరు లేకపోవడం, భరించలేని దుర్వాసన వెదజల్లుతున్నదని ప్రయాణికులు వాపోతుండటం గమనార్హం. బోగీల్లో అపరిశుభ్రత ప్రయాణికుల ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్నది. ఒకే రైలును పేరు మార్చి వివిధ రూట్లలో తిప్పడం వల్ల బోగీలను, టాయ్ లెట్లను శుభ్రపరచడం, బెర్తులు, సీట్లు, చెడిపోయిన నల్లాలు, పైపుల మరమ్మతు చేసే సమయం కూడా ఉండటం లేదని అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. ఒక్కోసారి ఎటువంటి ముందస్తు సూచనలు తెలపకుండా ప్యాసింజర్ రైళ్లు రద్దుచేయడం లేదా ఎక్స్‌ప్రెస్ రైళ్ల గమ్యం తగ్గించడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ వారంలో మిగ్‌జాం తుఫాన్ వల్ల రైళ్లు రద్దుచేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రద్దుచేయడం మంచిదే, కానీ, తుపాన్ ప్రభావం లేని ఖాజీపేట, విజయవాడ జంక్షన్ల మధ్య ప్రతిరోజు నడిచే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడం వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినా కేంద్రంలోని పాలకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. వారు కేవలం హామీలు, గ్యారంటీలకు పరిమితమయ్యారు. రైల్వేలు ప్రజల సొమ్ముతో నిర్మించినవి. అందుబాటు ధరల్లో సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ప్రజల వద్ద వసూలు చేసిన పన్నులు ద్వారా వచ్చిన సొమ్ముతో ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపరచాలి. వయో వృద్ధులకు గతంలో ఇచ్చిన రాయతీలు పునరుద్ధరించాలి. కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ ఖర్చుతో చంద్రయాన్‌కు రాకెట్ పంపినప్పుడు అంతకన్నా తక్కువ ఖర్చుతో రైళ్ల సంఖ్య పెంచి స్టేషన్లలో మౌలిక సదుపాయాలు, నూతన ప్యాసింజర్ రైళ్లు, బోగీల సంఖ్య పెంచవచ్చు. సుఖవంతమైన, ఎటువంటి అసౌకర్యం లేకుండా పరిశుభ్రమైన రైలు ప్రయాణం చేసినప్పుడే 'స్వచ్ఛ రైల్- స్వచ్ఛ్ భారత్' నినాదానికి సార్థకత ఏర్పడుతుంది. ఈ దిశగా రైల్వే అధికారులు దృష్టి సారించాలి.

## రెండో రోజూ నష్టాల బాటలో మార్కెట్లు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు పెరగడం, భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ జూన్ మధ్య నుంచి చూస్తే కనిష్ఠ స్థాయికి చేరాయి. బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో అమ్మకాలు మార్కెట్లపై మరింత ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 555.23 పాయింట్లు పతనమై 75,577.58 వద్ద ముగిసింది. నిఫ్టీ 144.05 పాయింట్లు కోల్పోయి 23,635.10 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 0.73 శాతం, నిఫ్టీ 0.61 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ప్రైవేట్ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు ఎక్కువగా పడిపోయాయి. మరోవైపు ఫార్మా, హెల్త్‌కేర్ రంగాలు కొంత మద్దతు ఇచ్చాయి. అయితే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు మాత్రం స్వల్ప లాభాలతో ముగిశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.21 శాతం, స్మాల్‌క్యాప్ 0.17 శాతం చొప్పున పెరిగాయి. చమురు ధరలు ఇదే స్థాయిలో కొనసాగితే మార్కెట్‌లో ఒడుదొడుకులు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. గత ఐదు, ఆరు నెలల్లో మిడ్, స్మాల్‌క్యాప్ షేర్లు భారీగా రాణించడంతో ఇకపై వాటి జోరు కొనసాగడం కష్టమేనని అభిప్రాయపడుతున్నారు. పెద్ద కంపెనీల షేర్లు, ఈక్విటీ ఆధారితేతర ఈటీఎఫ్‌ల వైపు దృష్టి పెట్టడం సురక్షితమని సూచిస్తున్నారు. ఇదిలా ఉంటే రూపాయి విలువ కూడా బలహీనపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 0.29 శాతం క్షీణించి 94.81 వద్ద ట్రేడైంది. డాలర్ 98.95 సమీపంలో ఉండగా.. బ్రెంట్ క్రూడ్ ధర 97 డాలర్ల వద్ద కొనసాగింది.

## వైసీపీకి రాజీనామా చేసిన బొత్స మేనల్లుడు

అమరావతి: వైసీపీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ సీనియర్ నేత, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను వైసీపీ అధినేత జగన్ కు పంపించారు. ఈ పరిణామం ఉత్తరాంధ్ర వైసీపీ శ్రేణులకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. మజ్జి శ్రీనివాసరావు తన రాజీనామా లేఖలో పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు, తాను నిర్వహిస్తున్న విజయనగరం జిల్లా అధ్యక్ష పదవి, భీమిలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి కూడా వైదొలగుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయన విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. బొత్స కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా, జిల్లాలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరించే చిన్న శ్రీను అకస్మాత్తుగా ఈ నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బొత్స సత్యనారాయణ కుటుంబానికి ఉత్తరాంధ్రలో గట్టి పట్టుంది.

# విద్యుత్ పోరాట అమరుడు కామ్రేడ్ సత్తెనపల్లి రామకృష్ణ త్యాగం స్ఫూర్తిదాయకం

## వర్ధంతి సందర్భంగా ఖానాపురం హవేలీలో మెగా రక్తదాన శిబిరం





**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** 2000 సంవత్సరంలో విద్యుత్ పోరాటంలో అమరుడైన కామ్రేడ్ సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి సందర్భంగా కానాపురం హవేలీలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ సత్తెనపల్లి రామకృష్ణ చిత్రపటానికి సీపీఎం పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కామ్రేడ్ పోతినేని సుదర్శన్ రావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కామ్రేడ్ బుగ్గవీటి సరళ మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిపిఎం పార్టీ హవేలి మండల కార్యదర్శి దొంగల తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఎం పార్టీ రాష్ట్ర సెక్రెటరేట్ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు మరియు పార్టీ జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజల హక్కుల కోసం, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, పేదలు--కార్మికులు--రైతుల ప్రయోజనాల కోసం జరిగిన పోరాటాల్లో అనేక మంది తమ ప్రాణాలను త్యాగం చేశారని, అలాంటి అమరుల త్యాగాలను స్మరించుకోవడం మన బాధ్యత అని అన్నారు. కామ్రేడ్ సత్తెనపల్లి రామకృష్ణ విద్యుత్ రంగంలో ప్రజా ప్రయోజనాలను కాపాడేందుకు జరిగిన పోరాటంలో ప్రాణత్యాగం చేశారని, ఆయన త్యాగం నేటికీ ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలుస్తోందని అన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రజలపై భారాలు పెరుగుతున్నాయని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ వైపు నడిపించే విధానాలు కొనసాగుతున్నాయని, కార్మికుల హక్కులను పరిమితం చేసే విధానాలు అమలు చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, సామాన్య ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కార్పొరేట్ అనుకూల విధానాలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే విధానాలను వ్యతిరేకించి, ప్రజలకు అందుబాటులో ఉండే చౌకైన విద్యుత్ కోసం పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. విద్యుత్, విద్య, వైద్యం వంటి మౌలిక రంగాలు ప్రజల హక్కులుగా ఉండాలని, వాటిని వ్యాపార ప్రయోజనాలకు అప్పగించరాదని పేర్కొన్నారు. అమరుల త్యాగాల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలని, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను మరింత ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రక్తదానం ఒక గొప్ప సామాజిక బాధ్యత అని, అత్యవసర పరిస్థితుల్లో ఒకరి రక్తం మరొకరి ప్రాణాలను కాపాడగలదని పేర్కొన్నారు. అమరుడు సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం ద్వారా ఆయన త్యాగాన్ని ప్రజాసేవతో స్మరించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర సెక్రరీడియట్ సభ్యులు ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరావు సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్ మరియు సిపిఎం పార్టీ నాయకులు అట్లాగే యూత్ పిల్లలు రక్తదానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వైవిక్రమ్ జిల్లా సెక్రెటరీ సభ్యులు బొంతు రాంబాబు బండి పద్మ జిల్లా కమిటీ సభ్యులు నందిపాటి మనోహర్, జబ్బర్, మీరా సాహెబ్, పిన్నింటి రమ్య,ఎస్ నవీన్ రెడ్డి, భూక్య శ్రీను బండారు రమేష్ పి ఝాన్సీ, వన్ టౌన్ టూ టౌన్ కార్యదర్శులు బోడపట్ల సుదర్శన్ ఎస్కే మీరా డివిజన్ కమిటీ సభ్యులు మండల కమిటీ సభ్యులు యూత్ మహిళలు పాల్గొన్నారు

# మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దాష్టీకం హేయమైన చర్య..

### సీఎం రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి!

### కోదాడలో భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు.. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

### మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

**కోదాడ, సెప్టెంబర్ 08(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా, కాంగ్రెస్ ప్రభుత్వ కనుసన్నల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్యంగా మహిళా శాసనసభ్యులపై పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తూ కోదాడలో నిరసన జ్వాలలు ఎగిసిపడ్డాయి. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలను ఎండగడుతూ కోదాడ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ నిరసన మరియు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మరియు పోలీసుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ మంత్రులు, సీనియర్ మహిళా శాసనసభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు కౌరవ సభను తలపించేలా, దుశ్శాసన పర్వాన్ని గుర్తుచేసేలా ఉందని మల్లయ్య యాదవ్ మండిపడ్డారు. ఇలాంటి అనైతిక దాడిని



ఖండించాల్సిన ముఖ్యమంత్రి, దాన్ని వక్రీకరిస్తూ పోలీసులను వెనకేసుకురావడం ఆయన అహంకారానికి నిదర్శనం అని, ఎన్నికల్లో అమలుకాని హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇన్నాళ్లవుతున్నా ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు. ఆ వైఫల్యం నుండి, ప్రజా సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి ఉద్దేశపూర్వకంగా అసెంబ్లీలో సభను పక్కదారి పట్టిస్తున్నారాని, ఒకవైపు గాంధేయవాదం గురించి మాట్లాడే రేవంత్ రెడ్డి, మరోవైపు రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో నడిబజారులో పట్టపగలే హత్యలు, దోపిడీలు, మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయి. హోం మంత్రి బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి శాంతి భద్రతలను గాలికి వదిలేశారు. రాష్ట్ర ప్రజల సంపదను దోచుకుని ఢిల్లీకి కప్పం కట్టేందుకే కాంగ్రెస్ నాయకులు పనిచేస్తున్నారని, తెలంగాణ ప్రజా ధనాన్ని ఢిల్లీకి దోచిపెడుతూ తెలంగాణ సమాజానికి నమ్మకద్రోహం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ సాధకుడు, జాతిపిత కేసీఆర్ గారిపై బురదజల్లే ప్రయత్నం చేస్తే ఆకాశం మీద ఉమ్మివేసినట్లేనని, అది తిరిగి మీ ముఖం మీదే పడుతుందని ముఖ్యమంత్రిని హెచ్చరించారు. ఆవేశంలో ఎవరైనా ఒక మాట జారితే ఉదయాన్నే ఇళ్లలోకి చొరబడి అరెస్టులు చేస్తున్న పోలీసులు.. మరి మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన దాడిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలనీ, దాడికి పాల్పడిన పోలీసు అధికారులపై తక్షణమే చట్టపరమైన, కఠిన చర్యలు తీసుకోవాలనీ, రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రజా సమస్యలపై, ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీల అమలుపై అసెంబ్లీలో సమగ్రమైన, సుదీర్ఘమైన చర్చ జరగాలనీ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ తన పోరాటాన్ని ఇలాగే కొనసాగిస్తుందని మల్లయ్య యాదవ్ గారు స్పష్టంచేశారు.



# పెబ్బేరు మున్సిపాలిటీలో పరిశుభ్రతే మా లక్ష్యం

### రూ.25.2 లక్షలతో మున్సిపాలిటీకి రెండు కొత్త ఆటోలు

### జెండా ఊపి ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్

**వనపర్తి సెప్టెంబర్ 8 క్రైమ్ మిర్రర్:** పెబ్బేరు పురపాలక సంఘంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు 15వ ఆర్థిక సంఘం (15ష్ట్ర ఖీఱఅఱఅవ జశీఎఎఱంంఱశీఅ) నిధుల నుంచి రూ.25.2 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన రెండు చెత్త సేకరణ ఆటోలను మంగళవారం మున్సిపల్ పాలకవర్గం అధికారికంగా ప్రారంభించింది. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, కమిషనర్ ఏ, సైదయ్య, కౌన్సిలర్లతో కలిసి వాహనాలకు పూజలు నిర్వహించి, జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, పట్టణ పరిధిలో నిత్యం చెత్త సేకరణ వేగవంతంగా జరిగేందుకే ఈ కొత్త వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రతి వార్డులోనూ ఇళ్ల వద్దకే ఆటోలు వచ్చి తడి, పొడి, చెత్తను వేర్వేరుగా సేకరిస్తాయని పేర్కొన్నారు. పట్టణవాసులు చెత్తను వీధుల్లో లేదా కాలువల్లో వేయకుండా ఆటో డ్రైవర్లకు మాత్రమే అందించాలని, పురపాలక సంఘాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వాములు కావాలని ఆయన తెలిపారుఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జములమ్మ, పర్వీన్ షకీల్, శివ సాయి, తాటికొండ కృష్ణ, భాగ్యలక్ష్మిశివ, హరి శంకర్ నాయుడు, మన్యం, సౌజన్య, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్షర జ్ఞానంతోనే మహిళా సాధికారత

### 100 శాతం మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### కోదాడలో 300 మంది మహిళలతో అవగాహన సదస్సు.. ర్యాలీ



**కోదాడ సెప్టెంబర్ 08 క్రైమ్ మిర్రర్ :** అక్షర జ్ఞానంతోనే మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించగలరని ఉమ్మడి నల్లగొండ జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కోదాడ పట్టణంలోని మండల స్వయం సహాయక సంఘాల కార్యాలయంలో మహిళలకు అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మహిళలకు అక్షరాస్యత ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం సుమారు 300 మంది మహిళలతో కోదాడ పట్టణంలో అవగాహన సదస్సు నిర్వహించి, ర్యాలీ చేపట్టారు. మహిళలు చదువుకోవడం ద్వారా తమ హక్కులు, బాధ్యతలు, ప్రభుత్వ పథకాలు, ఆర్థిక అంశాలపై అవగాహన పెంచుకోవచ్చని అధికారులు వివరించారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. మహిళలు అక్షరాస్యులైతే కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. చదువు కేవలం ఉద్యోగం కోసమే కాకుండా.. రోజువారీ జీవితంలో నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంచుతుందని తెలిపారు. మహిళల్లో అక్షరాస్యత శాతం పెంచేందుకు వయోజన విద్యా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి మహిళ అక్షరాస్యురాలిగా మారేలా కృషి చేయడం, 100 శాతం మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలను చైతన్యపరిచి, అక్షరాస్యత కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వయోజన విద్య అడిషనల్ పీడీ సురేష్, ఏపీఎం వెంకన్న, సీసీ రామకృష్ణ, చిన్ని, కోదాడ, అనంతగిరి మండల అధ్యక్షులు నాగలక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.

# ఇంట్లోకి చొరబడి కత్తితో బెదిరించి డబ్బులు డిమాండ్

### కల్వకుర్తిలో మహిళపై ఫిర్యాదు

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** ఇంట్లోకి అక్రమంగా చొరబడిన ఓ మహిళ కత్తితో బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన ఘటన కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం.. విద్యానగర్ కాలనీకి చెందిన దున్న దీవి ప్రియదర్శిని తన ఇంట్లో మధ్యాహ్నం సుమారు 2:30 గంటల సమయంలో ఉండగా, గుర్తుతెలియని ఓ మహిళ అకస్మాత్తుగా ఇంట్లోకి ప్రవేశించింది. అనంతరం బాధితురాలి కళ్లలో కారం చల్లి, భయభ్రాంతులకు గురిచేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తన మెడపై కత్తి పెట్టి రూ.10 వేల నగదు ఇవ్వాలని ఆ మహిళ డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఇదే సమయంలో తన ఫోన్ కనిపించడం లేదంటూ ఆ మహిళ ఆందోళనకు గురై, ఇంట్లో వెతుకుతున్న క్రమంలో కత్తి కిందపడిన శబ్దం వచ్చిందని బాధితురాలు పేర్కొన్నారు. అవకాశం చూసుకుని బాధితురాలు ధైర్యంగా ఆ మహిళను పట్టుకుని పరిశీలించగా, గతంలో తమ ఇంటి సమీపంలో నివసించిన వ్యక్తిగా గుర్తించినట్లు తెలిపారు. దీంతో ఆమెను గుర్తుపట్టినట్లు తెలియడంతో అక్కడి నుంచి ఆ మహిళ పరారైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తన ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి, కళ్లలో కారం చల్లి, కత్తితో బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేసిన మహిళపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రియదర్శిని పోలీసులను కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గురుమూర్తి తెలిపారు

# కల్వకుర్తి ఆసుపత్రిలో నాణ్యత ప్రమాణాలపై ఎయిమ్స్ బృందం పరిశీలన



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యత ప్రమాణాలపై బీబీనగర్ ఎయిమ్స్ మెడికల్ కాలేజ్ బృందం మంగళవారం పరిశీలన నిర్వహించింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ బీబీనగర్ క్వాలిటీ మేనేజర్ నాగు నాయక్ ఆధ్వర్యంలోని బృందం ఆసుపత్రిలోని పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఓపీ విభాగం, వార్డులు, ఫార్మసీ, ల్యాబొరేటరీ తదితర విభాగాలను పరిశీలించారు. ఆయా విభాగాల్లో అమలవుతున్న నాణ్యత ప్రమాణాలు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, పరిశుభ్రత, మందుల నిర్వహణ, ల్యాబొరేటరీ విధానాలు తదితర అంశాలను బృందం పరిశీలించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో నాణ్యత ప్రమాణాలను మరింత మెరుగుపరిచి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందితో చర్చించారు. ఆయా విభాగాల నిర్వహణ, పరిశుభ్రత, ఇన్ఫెక్షన్ నియంత్రణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ యశోద, డాక్టర్ వసంత, డాక్టర్ మాధురి, డాక్టర్ షకీల్, డాక్టర్ రోజారాణి, డాక్టర్ విష్ణు, డాక్టర్ మాధవి, నర్సింగ్ సూపరింటెండెంట్, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు, ల్యాబ్, ఫార్మసీ, పారామెడికల్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, ఇన్ఫెక్షన్ కంట్రోల్ స్టాఫ్ అనిత తదితరులు పాల్గొన్నారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595

# భూ రీ సర్వేను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి: కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 08:** భూ రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐ డి ఓ సి లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి తహసీల్దార్లు, సర్వే, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మండలాల వారీగా రీ సర్వే పురోగతిని సమీక్షించారు. రీ సర్వేలో గ్రామసభను మొదటి దశగా నిర్వహించి రైతులకు సర్వే విధానం, తేదీలు, భూ హద్దుల నిర్ధారణ తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామసభలు పూర్తయిన వెంటనే గ్రామ సరిహద్దుల నిర్ణయం, హద్దుల గుర్తింపు, క్షేత్రస్థాయి సర్వే వంటి తదుపరి ప్రక్రియలను ఆలస్యం లేకుండా ప్రారంభించాలని ఆదేశించారు.మండలాల వారీగా సమీక్షలో కొన్ని గ్రామాల్లో గ్రామ సరిహద్దుల నిర్ణయం, హద్దుల స్థిరీకరణ, సర్వే పనులు కొనసాగుతున్నట్లు, మరికొన్ని గ్రామాల్లో గ్రామసభలు పూర్తయి తదుపరి ప్రక్రియకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు వివరించారు. పెండింగ్‌లో ఉన్న గ్రామాల్లో వెంటనే గ్రామసభలు నిర్వహించి సర్వే ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు, జీపీఓలు, వీఆర్‌ఓలను సమర్థవంతంగా వినియోగించి రోజువారీ లక్ష్యాలతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాత భూ రికార్డులు, మ్యాపులను పరిశీలించి, భూ హద్దులు, సర్వే పాయింట్లు, కోఆర్డినేట్ల నమోదులో పూర్తి ఖచ్చితత్వం పాటించాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సక్రమంగా వినియోగించాలని తెలిపారు. సర్వే పూర్తయిన అనంతరం రైతులకు ఖచ్చితమైన



హద్దులు, కోఆర్డినేట్లతో కూడిన భూ మ్యాప్ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సీతారామ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. మండలాల వారీగా భూముల వివరాలు, భూ హద్దుల నిర్ధారణ, పెండింగ్‌లో ఉన్న భూసేకరణ అంశాలను సమీక్షించారు. భూ యజమానులతో సమన్వయం చేసుకుంటూ సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, భూముల హద్దులను స్పష్టంగా నిర్ధారించి నిబంధనల ప్రకారం భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణకు సంబంధించి ఎక్కడైనా సమస్యలు లేదా అభ్యంతరాలు ఉంటే వాటిని వెంటనే గుర్తించి పరిష్కరించాలని, అవసరమైన శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనులను ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో నోటీసుల జారీ, హియరింగ్స్ , సంబంధిత పత్రాల ఆన్‌లైన్ అప్‌లోడ్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. మండలాల వారీగా హియరింగ్స్ పురోగతిని పరిశీలించి, కొన్ని మండలాల్లో హియరింగ్స్ సంఖ్య సిస్టమ్‌లో నమోదు కాకపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చంద్రుగొండ మండలంలో 24 నోటీసులకు సంబంధించి హియరింగ్స్ నిర్వహించినప్పటికీ, సంబంధిత పత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయకపోవడంతో సిస్టమ్‌లో పురోగతి నమోదు కాలేదని అధికారులు వివరించారు. హియరింగ్ నిర్వహించడంతో పాటు సంబంధిత పత్రాలను కూడా వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో జిల్లాలో రాష్ట్రస్థాయి పురోగతి 62 శాతంగా ఉండగా, భద్రాచలం 57.51 శాతం, పినపాక 51 శాతం పురోగతి నమోదైనట్లు సమీక్షలో వెల్లడైంది. గుండాల, పాల్వంచ, పినపాక, అశ్వాపురం, అల్లపల్లి, చంద్రుగొండ, దమ్మపేట, కరకగూడెం తదితర మండలాల్లో నోటీసుల జారీ, హియరింగ్స్ పురోగతిని పరిశీలించారు. ఇప్పటికే నోటీసులు జారీ చేసిన కేసుల్లో హియరింగ్స్ నిర్వహించి, సంబంధిత పత్రాలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. రాబోయే రెండు మూడు రోజుల్లో నోటీసుల జారీ, హియరింగ్స్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలని, నోటీసు జారీ నుంచి హియరింగ్, పత్రాల అప్‌లోడ్ వరకు ప్రతి దశను ప్రతిరోజూ పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు .



## ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ

### లబ్ధిదారునికి ప్రొసీడింగ్స్ అందజేసిన మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్

**వనపర్తి సెప్టెంబర్ 8 క్రైమ్ మిర్రర్:** పెబ్బేరు మున్సిపాలిటీలోని 12వ వార్డులో లబ్ధిదారులు గంగారం సరస్వతి, గంగారం రాముడు దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటికి మంగళవారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించిన మంజూరు ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తోందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ?తమకు ఇల్లు మంజూరు కావడంపై లబ్ధిదారులు గంగారం సరస్వతి, రాముడు తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు.నిరుపేదల ఇళ్ల కల నెరవేరుస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, నిరంతరం నియోజకవర్గ అభివృద్ధికి శ్రమిస్తున్న స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డికి లబ్ధిదారుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, నాయకులు రాములు యాదవ్, రంగ నరసింహ, గొల్ల వెంకట్ రాములు, కె .పరుశరాముడు బోల్గర్ రాజు, వార్డు ఆఫీసర్ అశోక్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగు శివకృష్ణ చొరవతో దివ్యాంగునికి కృత్రిమ కాలు అందజేత



**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 08 (క్రైమ్ మిర్రర్) :** ప్రమాదంలో కుడికాలు కోల్పోయి గత ఐదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివ్యాంగుడు తిరుమాల్‌కు తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ చొరవతో కృత్రిమ కాలు అందజేశారు. గుంటూరుకు చెందిన తిరుమల్ విధి నిర్వహణలో జరిగిన ప్రమాదంలో కుడికాలు కోల్పోయారు. అప్పటి నుంచి రోజువారీ పనులు చేసుకోవడానికే తీవ్ర ఇబ్బందులు పడుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ విషయాన్ని నరేష్, మెరుగు శివకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. తిరుమల్ పరిస్థితిని తెలుసుకున్న శివకృష్ణ వెంటనే స్పందించి, అవసరమైన సహాయం అందించేందుకు భారత్ వికాస్ పరిషత్ వికలాంగుల పునరావాస కేంద్రం ట్రస్ట్‌ను సంప్రదించారు. వారి సహకారంతో తిరుమాల్‌కు కృత్రిమ కుడికాలు (ఆర్టిఫిషియల్ రైట్ లెగ్) అందేలా చర్యలు చేపట్టారు. మంగళవారం కృత్రిమ కాలును అమర్చడంతో తిరుమాల్‌లో కొత్త ఆశలు చిగురించాయి. ఇకపై రోజువారీ పనులను మరింత సులభంగా చేసుకునే అవకాశం లభించడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంకీ సహకారం చేసినవారు భారత్ వికాస్ ట్రస్ట్ మేనేజర్ నరేంద్ర, టెక్నీషియన్లు రఘు, మధు, స్వామి, చింతల విజయ్ కుమార్, రఘువరన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెరుగు శివకృష్ణ మాట్లాడుతూ.. సమాజంలో ఇంకా అనేక మంది దివ్యాంగులు సహాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. దాతలు ముందుకు వచ్చి పేద కుటుంబాలకు చెందిన దివ్యాంగులకు విద్య, ఉపాధి, వైద్యం, వివాహం వంటి అంశాల్లో ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అవసరంలో ఉన్న ప్రతి దివ్యాంగుడికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన భారత్ వికాస్ ట్రస్ట్‌కు దివ్యాంగుల తరఫున మెరుగు శివకృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ పై దాడి: కేసు నమోదు...



మాదాపూర్ క్రైమ్ మిర్రర్ : వాచ్‌మెన్ పై దాడి జరిగిన ఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మాదాపూర్ పరిధిలోని ట్రెండ్స్ అస్పైర్ అపార్ట్‌మెంట్‌లో రాత్రి 8:45 గంటల ప్రాంతంలో వాచ్‌మెన్‌పై దాడి జరిగిన ఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం .అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న కాడ దుర్గ, వెంకటరమణ విధుల్లో ఉండగా, గేటు మూసివేసిన విషయమై ఆరో అంతస్తులోని జియోనిగ్జా ఏడుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన వ్యక్తులతో వాగ్వాదం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ క్రమంలో శివ సాయి, కృష్ణ, స్వామి, జితేంద్ర అనే నలుగురు వ్యక్తులు వెంకటరమణను దుర్భాషలాడుతూ, ప్లాస్టిక్ కుర్చీలతో దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అడ్డుకునేందుకు ప్రయత్నించిన కాడ దుర్గను కూడా పక్కకు తోసినట్లు ఫిర్యాదులో ఉంది. దాడిలో వెంకటరమణ తలకు తీవ్ర రక్తగాయమైంది.ఈ ఫిర్యాదు మేరకు మాధాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నోటీసుల పంపిణీ..!!

### పుంజుకున్న ఎస్ఐఆర్ ప్రక్రియ

### ఇంటింటికీ బూత్ స్థాయి అధికారులు నోటీసుల పంపిణీ

### ఓటర్ల నుంచి ధ్రువపత్రాల సేకరణ

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి :** భూపాలపల్లి పట్టణ పరిధిలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా నోటీసుల పంపిణీ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. బండి శ్రీనివాస్ పర్యవేక్షణలో సంబంధిత అధికారులు, బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నోటీసుల పంపిణీని వేగవంతం చేస్తున్నారు.వివిధ కారణాలతో నోటీసులు జారీ చేసిన ఓటర్లకు సంబంధిత నోటీసులను బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి అందజేస్తున్నారు. భూపాలపల్లి పట్టణ పరిధిలో మొత్తం 11,256 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయగా, ఇప్పటివరకు సుమారు 4,200 నోటీసులు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఇంకా 7,000కు పైగా నోటీసులు పంపిణీ చేయాల్సి ఉండటంతో ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నారు.

**క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన**

రెండు రోజుల క్రితం భూపాలపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ తదితర అధికారులు క్షేత్రస్థాయిలో నోటీసుల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. సంబంధిత బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి నోటీసులను సకాలంలో అందజేయాలని, పెండింగ్‌లో ఉన్న నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలని సూచించారు. ఇదే క్రమంలో నోటీసుల పంపిణీ ప్రక్రియను



త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నుంచి కూడా ఆదేశాలు అందినట్లు అధికారులు తెలిపారు.

**ఇంటింటికీ వెళ్లి నోటీసుల అందజేత**

ఈ నేపథ్యంలో నిన్నటి నుంచి భూపాలపల్లి పట్టణ పరిధిలో నోటీసుల పంపిణీ ప్రక్రియ మరింత వేగం పుంజుకుంది. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ తిరుగుతూ నోటీసులను సంబంధిత ఓటర్లకు అందజేస్తున్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు సమర్పిస్తున్న సంబంధిత ధ్రువపత్రాలను కూడా అధికారులు సేకరిస్తున్నారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా ఉండేలా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అధికారులు కొనసాగిస్తున్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమకు సంబంధించిన వివరాలు, అవసరమైన ధ్రువపత్రాలను అధికారులకు సమర్పించాలని సూచిస్తున్నారు.

## ఫతేనగర్‌లో ఘనంగా వినాయకుని స్వాగతం

### 27 ఏళ్ల సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న శ్రీ సిద్ధి వినాయక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఫ్యాబ్ టీం

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 08 (క్రైమ్ మిర్రర్):** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఫతేనగర్ నేతాజీ నగర్‌లో శ్రీ సిద్ధి వినాయక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఫ్యాబ్ టీం ఆధ్వర్యంలో వినాయకుని స్వాగత కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గత 27 సంవత్సరాలుగా భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలను




నిర్వహిస్తున్న ఫ్యాబ్ టీం ఈ ఏడాది కూడా ఘనంగా వేడుకలకు శ్రీకారం చుట్టింది. ఫతేనగర్ నేతాజీ నగర్ పైప్ లైన్ రోడ్ ప్రాంతంలో గత మూడు సంవత్సరాలుగా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న ఫ్యాబ్ టీం వినాయకుని ఆగమనం, స్వాగత కార్యక్రమం ఈసారి కూడా అత్యంత వైభవంగా సాగింది. భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో నేతాజీ నగర్, ఫతేనగర్ పైప్ లైన్ రోడ్ ప్రాంతాలు భక్తజన సందోహంతో కళకళలా డాయి. ప్రత్యేక అలంకరణలు, ఆకట్టుకునే కార్యక్రమాలతో వినాయకుని స్వాగతం నిర్వహించడంతో స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. ఫ్యాబ్ టీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. యువత ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పరిసర ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా శ్రీ సిద్ధి వినాయక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఫ్యాబ్ టీం అధ్యక్షుడు సూర్యకిరణ్, ఉపాధ్యక్షుడు శివకుమార్, రాజు (ప్రధాన కార్యదర్శి), సంతోష్, శివరాం (సంయుక్త కార్యదర్శులు), మోహన్, సాయికుమార్ యాదవ్, శుభోద్ తదితరులు, ఖజాంచి ధనరాజ్, ముఖ్య సలహాదారు నాగరాజ్ పాల్గొన్నారు. 27 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని మరింత వైభవంగా ముందుకు తీసుకెళ్తూ, భక్తి--సామాజిక ఐక్యతకు ప్రతీకగా ఫ్యాబ్ టీం నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాలు స్థానికంగా ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాయి.

## రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుపై ఆశాభావం.. కీసరలో రాష్ట్ర రెడ్డి సంఘాల సమీక్ష సమావేశం

### రెడ్డి జేఏసీ అధ్యక్షులు అప్పమ్మగారి రాంరెడ్డి

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 08 (క్రైమ్ మిర్రర్) :** రాష్ట్ర రెడ్డి సంఘాలు, రెడ్డి జేఏసీ, రెడ్డి ఐక్య వేదిక, రెడ్డి జాగృతి, రెడ్డి సంఘం తెలంగాణ ఆధ్వర్యంలో కీసరలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 8న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాను రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు విరమించిన నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణ, ప్రభుత్వ హామీల అమలుపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా రెడ్డి జేఏసీ అధ్యక్షులు అప్పమ్మగారి రాంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుని రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. రెడ్డి సంఘాల తరఫున చేపట్టిన కార్యక్రమాలపై, భవిష్యత్‌లో అనుసరించాల్సిన కార్యాచరణపై నాయకులు సమీక్షించారు. రెడ్డి సమాజానికి సంబంధించిన సమస్యలు, సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యా--ఆర్థిక అభివృద్ధి తదితర అంశాలపై కూడా సమావేశంలో చర్చించినట్లు నాయకులు తెలిపారు.



ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన సందర్భాల్లో సంఘటితంగా ముందుకు సాగాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో గోపు జైపాల్ రెడ్డి, ఏనుగు సంతోష్ రెడ్డి, పైళ్ల హరినాథ్ రెడ్డి, బుట్టెంగారి మాధవరెడ్డి, చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి, సింగిరెడ్డి రాంరెడ్డి, చందుపట్ల వెంకట్ రెడ్డి, రేసు లక్ష్మారెడ్డి, తుమ్మల మధుకర్ రెడ్డి, కంచర్ల మధుసూదన్ రెడ్డి, నీరుడుదయాకర్ రెడ్డి, చిట్టిరెడ్డి గోపాల్ రెడ్డి, రాజా రెడ్డి, నారెడ్డి రవీందర్ రెడ్డి, పల్లె మోహన్ రెడ్డి, నర్సింహారెడ్డి, కర్ణాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రుద్ర రెడ్డి, దయాకర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రాధికా రెడ్డి, పుష్పలత రెడ్డి, పోరెడ్డి కవితా రెడ్డి తదితర రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు. “ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి” ధర్నాను తాత్కాలికంగా విరమించినప్పటికీ, రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని నాయకులు ఆకాంక్షించారు. హామీ అమలు దిశగా ప్రభుత్వం ముందుకు వస్తే సహకరిస్తామని, లేని పక్షంలో భవిష్యత్ కార్యాచరణపై మరోసారి సమావేశమై నిర్ణయం తీసుకుంటామని నాయకులు పేర్కొన్నారు.

# నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి

**యూత్ సభ్యులు, ఉత్సవ కమిటీలు నిబంధనలు తప్పక పాటించాలి**

**నాంపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ దూది రాజు**




**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** మర్రిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో రానున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని, నాంపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ దూది రాజు సూచించారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించే యూత్ సభ్యులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పక పాటించాలని ఆయన కోరారు. వినాయక మండపాల వద్ద అధిక శబ్దం కలిగించే డీజేలకు అనుమతి లేదని సీఐ రాజు స్పష్టం చేశారు. మండపాల వద్ద స్పీకర్లను తక్కువ శబ్దంతో, రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. డీజేలు, అధిక శబ్దంతో లౌడ్స్పీకర్లు ఏర్పాటు చేసి ప్రజలకు, విద్యార్థులకు, ఆసుపత్రుల్లోని రోగులకు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు, ఇతర ప్రార్థనా మందిరాలకు ఇబ్బందులు కలిగించరాదన్నారు. గణేష్ మండపాలను ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా తగిన ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపం ఏర్పాటు చేసే స్థలానికి సంబంధిత యాజమాని అనుమతి తీసుకోవడంతో పాటు, అవసరమైన అన్ని శాఖల అనుమతులు పొందాలని తెలిపారు. విద్యుత్ కనెక్షన్ను విద్యుత్ శాఖ అనుమతితోనే తీసుకోవాలని, షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా నాణ్యమైన వైర్లను ఉపయోగించాలని సూచించారు. మండపాల వద్ద నిర్వాహక కమిటీ వివరాలు, బాధ్యత వహించే వ్యక్తుల పేర్లు, ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని తెలిపారు. మండపాల్లో 24 గంటలు కనీసం ఇద్దరు వాలంటీర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గణేష్ ప్రతిమను ప్రతిష్టించే ప్రదేశంలో నాణ్యమైన స్టేజ్, షెడ్ ఏర్పాటు చేసి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం, అసభ్యకరమైన నృత్యాలు నిర్వహించడం, ఇతర మతాల మనోభావాలను దెబ్బతీసేలా ప్రసంగాలు చేయడం, పాటలు పాడటం వంటి చర్యలకు పూర్తిగా దూరంగా ఉండాలని సీఐ దూది రాజు హెచ్చరించారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, పోలీసు అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు సూచనలు నమోదు చేసేందుకు, పాయింట్ పుస్తకం తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. గణేష్ విగ్రహాల ఏర్పాటు కోసం నిర్వాహకులు పోలీస్ పోర్టల్లో వివరాలు నమోదు చేసి, దరఖాస్తును సంబంధిత పోలీస్ స్టేషన్లో అందజేయాలని సూచించారు. మండపాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, ఇతర వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 112కు కానీ స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సోషల్ మీడియాలో వచ్చే రూమర్లు, వదంతులను నమ్మకుండా, ఎలాంటి అనుమానాలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఇతర మతాల మనోభావాలను దెబ్బతీసేలా పోస్టులు, వ్యాఖ్యలు చేయవద్దని సీఐ దూది రాజు సూచించారు. సోషల్ మీడియాపై పోలీసులు ప్రత్యేకంగా నిఘా ఉంచుతున్నందున, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మర్రిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల గణేష్ ఉత్సవ కమిటీలు, యూత్ సభ్యులు పోలీసులకు సహకరిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని, పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బి. రాంబాబు పాల్గొని, యూత్ సభ్యులకు ఉత్సవ కమిటీలకు, పలు సూచనలు చేశారు.



# కౌమారుల ఆరోగ్యం పై అవగాహన

**పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేసిన డీఎంహెచ్వో**

**మంచిర్యాల: సెప్టెంబర్ 8 ( క్రైమ్ మిర్రర్) :** కౌమార బాలబాలికల ఆరోగ్యంపై విస్తృత అవగాహన కల్పించాలని డీఎంహెచ్వో డాక్టర్ నరేందర్ రాథోడ్ సూచించారు. రాష్ట్రీయ కిషోర్ స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా 10--19 ఏళ్ల బాలబాలికల కోసం రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్సీలు, ఉపకేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల్లో కౌమార ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఆరోగ్య సమస్యలపై పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడేలా నమ్మకం, భరోసా, గోప్యత కల్పించాలన్నారు. రుతుస్రావం, లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యం, రక్తహీనత, మానసిక ఆరోగ్యం, పోషకాహారం, వ్యసనాల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. బాలబాలికలకు మంచి స్పర్శ--చెడు స్పర్శ, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై చైతన్యం కల్పించాలన్నారు. ఆపదలో 1098 టోల్ఫ్రీ నంబర్ను సంప్రదించాలని సూచించారు. 'మేము పిల్లలం.. అప్పుడే కాము తల్లులం' అనే నినాదంతో బాల్యవివాహాల నివారణపై ప్రచారం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ సుధాకర్ నాయక్, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ అనిల్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సీహెచ్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

# చీకటి పడితే చాలు.. ఒంటరిగా వెళ్లేవారే టార్గెట్!

**ఎల్లమ్మబండలో దంపతులను అడ్డగించి దాడి.. మహిళ ఆభరణాలు లాక్కెళ్లిన ముగ్గురు అరెస్ట్**

**సుమారు 4 గ్రాముల బంగారు చెవిపోగులు, ప్లాటినం ఉంగరం స్వాధీనం**



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 08 (క్రైమ్ మిర్రర్):** చీకటి పడిన తర్వాత ఒంటరిగా ప్రయాణించే వారిని లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. ఎల్లమ్మబండలోని సిక్కు బస్తీ, గురు గోవింద్ సింగ్ కాలనీ సమీపంలో జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించి నిందితుల నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 6వ తేదీ రాత్రి సుమారు 7 గంటల సమయంలో ఓ మహిళతో పాటు మరో వ్యక్తి బైక్పై కూకట్పల్లి నుంచి జీడిమెట్లలోని తమ ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎల్లమ్మబండలోని సిక్కు బస్తీ, గురు గోవింద్ సింగ్ కాలనీ వద్దకు చేరుకోగానే ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు వారి బైక్ను అడ్డగించారు. అనంతరం వారిని బెదిరించి రహదారి పక్కనే ఉన్న ఏకాంత ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ ఇద్దరిపై దాడి చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరించిన నిందితులు.. మహిళ వద్ద ఉన్న బంగారు చెవిపోగులు, ప్లాటినం ఉంగరాన్ని బలవంతంగా లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై సెప్టెంబర్ 7వ తేదీ తెల్లవారుజామున 12.45 గంటలకు ఫిర్యాదు అందడంతో జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా ముగ్గురు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

**అరెస్టయిన నిందితులు వీరే**

ఎ1. తిలిపిత్య దీపక్ సింగ్ (45) -- తారా సింగ్ కుమారుడు. వెల్డింగ్ పని చేస్తూ ఎల్లమ్మబండలోని గురు గోవింద్ సింగ్ కాలనీలో నివాసం.

ఎ2. బౌరీ రచన్ సింగ్ (25) -- బౌరీ జగ్జిత్ సింగ్ కుమారుడు. ఫ్యాబ్రికేషన్ పని చేస్తూ గురు గోవింద్ సింగ్ కాలనీలో నివాసం.

ఎ3. బురానీ సుర్జిత్ సింగ్ (25) -- దివంగత బురానీ జగన్ సింగ్ కుమారుడు. వెల్డింగ్ పని చేస్తూ గురు గోవింద్ సింగ్ కాలనీలో నివాసం. విచారణలో నిందితులు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో దోపిడీకి పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 8న ముగ్గురినీ అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం నిందితులకు న్యాయ రిమాండ్ విధించింది. పోలీసుల ప్రకారం, నిందితులు ప్రధానంగా సూర్యాస్తమయం తర్వాత చీకటి సమయంలో సిక్కు బస్తీ, ఎల్లమ్మబండ వైపు వెళ్లే మార్గాల్లో సంచరిస్తూ ఒంటరిగా ప్రయాణించే వ్యక్తులను లక్ష్యంగా చేసుకునేవారు. వారిని మార్గమధ్యంలో అడ్డగించి ఏకాంత ప్రాంతానికి తీసుకెళ్లి దాడి చేయడం, బెదిరించడం, బలవంతంగా నిర్బంధించడం, అనంతరం వారి వద్ద ఉన్న నగదు, ఆభరణాలను దోచుకోవడం నిందితుల విధానంగా పోలీసులు గుర్తించారు. నిందితుల్లో ఒకరికి గతంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రివేళ జరిగిన నేరానికి సంబంధించి గత నేరచరిత్ర ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి బాధితురాలికి చెందిన సుమారు 4 గ్రాముల బరువున్న ఒక జత బంగారు చెవిపోగులు, ఒక ప్లాటినం ఉంగరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**పోలీసు బృందానికి ఉన్నతాధికారుల అభినందనలు**

కుత్బుల్లాపూర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎన్. కోటిరెడ్డి, ఐపీఎస్, కుత్బుల్లాపూర్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఏసీ బాలగంగి రెడ్డి మార్గదర్శకత్వంలో ఈ కేసును పోలీసులు ఛేదించారు. కేసు దర్యాప్తులో ఇన్స్పెక్టర్ ఎన్. సురేష్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ పి. నరేంద్ర రెడ్డి, సబ్ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాస్ తో పాటు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ క్రైమ్ సిబ్బంది కీలకంగా వ్యవహరించారు. చీకటి వేళల్లో ఏకాంత మార్గాల్లో ప్రయాణించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

# మాధాపూర్ లో ఈ-సిగరెట్ల పై ఈగాల్ టీమ్ దాడి..

**రూ. 72,500 నగదు, వేప్స్ స్వాధీనం....**





క్రైమ్ మిర్రర్ మాధాపూర్: మాధాపూర్ లో నిషేధిత ఈ-సిగరెట్లు, వేప్స్ అక్రమ విక్రయాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. మాధాపూర్ ఎస్ఎచ్ఓ కే వీ సుబ్బారావు ఆధ్వర్యంలోని ఈగల్ టీమ్ మెట్రో పిల్లర్ నంబర్ 1762 సమీపంలోని "ధి స్మోక్ షాప్ "పై సోదాలు చేపట్టింది. సోదాల్లో షాపులో ఉద్యోగిగా పనిచేస్తున్న అబూబక్కర్ సిద్ధిక్ ఎం. (26) వద్ద నుంచి వివిధ బ్రాండ్లకు చెందిన నిషేధిత ఈ-సిగరెట్లు, వేప్స్, పాడ్స్, కార్ట్రిడ్జ్లు, నికోటిన్ పౌచ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాట

ు విక్రయాల ద్వారా వచ్చినట్లు అనుమానిస్తున్న రూ. 72,500 నగదు, రెండు మొబైల్ ఫోన్లు, పేటీయం క్యూఆర్ /యూపీఐ వివరాలను సీజ్ చేశారు. ప్రాథమిక విచారణలో వాట్సాప్ ద్వారా కస్టమర్ల నుంచి ఆర్డర్లు తీసుకుని, క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు స్వీకరించి, రాపిడో , పోర్టర్ వంటి డెలివరీ సేవల ద్వారా వేప్స్ను కస్టమర్లకు చేరవేస్తున్నట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి మొబైల్ ఫోన్లో పోర్టర్ లావాదేవీలు, వేప్స్కు సంబంధించిన వాట్సాప్ చాట్స్ గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో షాపు యజమాని అబ్దుల్ సఫ్వాన్, ఉద్యోగి అబూబక్కర్ సిద్ధిక్తో పాటు సరఫరాదారుల పాత్రపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే మైనర్లకు నిషేధిత ఉత్పత్తులు విక్రయించారా అనే అంశంపైనా విచారణ కొనసాగుతోంది. ఎస్.ఐ. సురేష్ కుమార్ తెలిపారు. నిషేధిత ఈ-సిగరెట్ల అక్రమ నిల్వ, విక్రయాలు, సరఫరాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మాధాపూర్ పోలీసులు హెచ్చరించారు.

# పాఠశాలలను ఫైర్ ఎన్వోసీ నుంచి మినహాయించాలి

**ప్రస్తుతం ఉన్న పాఠశాలకు స్వీయ ధ్రువీకరణ తీసుకుంటే సరిపోతుంది**

**ఫైర్ శాఖ డైరెక్టర్ కు విన్నవించిన ట్రస్మా బృందం**



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 08 (క్రైమ్ మిర్రర్) :** ప్రస్తుతం నిర్వహిస్తున్న పాఠశాలలకు ఫైర్ ఎన్ఓసి ల నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాల యాజమాన్య సంఘం (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నానక్ రామ్ గూడ లోని తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డిపార్ట్మెంట్ (ఐ ఆర్ డి ఎ ) డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ కి ప్రతినిధి బృందం వినతి పత్రాన్ని అందజేశారు. ఫైర్ ఎన్ ఓ సి పొందడం లో ఎకనామికల్ పాఠశాలల నిర్వహకులు పడుతున్న బాధలు, వాస్తవాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నూతన నిబంధనలు రూపకల్పనాలో తమ అభిప్రాయాలను, సూచనలను పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే నడుస్తున్న పాఠశాలలకు కూడా ఫైర్ ఎన్ఓసి ని అడగడం సరికాదని ఎస్ ఎన్ రెడ్డి తెలిపారు. పాఠశాల నిర్వాహకుల వద్ద నుంచి స్వీయ ధ్రువీకరణ తీసుకుంటే సరిపోతుందని తెలిపారు. డే స్కాలర్ స్కూల్స్ కమర్షియల్ క్యాటగిరిలో పరిగణించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. సెట్బాక్ లో రిలాక్సేషన్ ఇవ్వాలని కోరారు. ఎన్ ఓ సి సర్టిఫికేషన్ ఫీజు నామినల్ చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో ఫైర్ సేఫ్టీ అవేర్నెస్ ప్రోగ్రాం కండక్ట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలను ఇతర వ్యాపార సముదాయాలు, హోటళ్లు, సినిమా థియేటర్లతో పోల్చి చూడవద్దని వాటికి పాఠశాలకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని పాఠశాలను ప్రత్యేక కేటగిరి కింద పరిగణించి నిబంధనలను సరళీకృతం చేయాలని కోరారు. ఇందుకు డైరెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కె అనిల్ కుమార్, కోశాధికారి కె శ్రీకాంత్ రెడ్డి లు హాజరయ్యారు.

# సైబరాబాద్లో సీఎంసీ కూల్చివేతల డ్రైవ్....






క్రైమ్ మిర్రర్ సైబరాబాద్: అనధికార నిర్మాణాలపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కూల్చివేతల డ్రైవ్ కొనసాగుతోంది. మూడు జోన్లలో 14 అనధికార నిర్మాణాలను గుర్తించి 14 కూల్చివేతలు చేపట్టారు. మరో 3 నిర్మాణాలకు నోటీసులు జారీ చేశారు.

జోన్ల వారీగా: శేరిలింగంపల్లి జోన్ - 5- కూకట్పల్లి జోన్ - 4

- కుత్బుల్లాపూర్ జోన్ - 5నిబంధనల ప్రకారం చర్యలు కొనసాగుతున్నాయని సీఎంసీ తెలిపింది.

# హామీలు నెరవేర్చకపోతే కాంగ్రెస్‌కు రాజకీయ సమాధి తప్పదు

## బీఆర్ఎస్ నేతల నిరసన.. ప్రజావాణిలో వినతిపత్రం, మర్రిగూడ చౌరస్తాలో రాస్తారోకో

**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైతే, ఆ పార్టీకి రాజకీయ సమాధి తప్పదని తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ హెచ్చరించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా, బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఏడు రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా, సోమవారం మర్రిగూడ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పల్లె రవికుమార్ గౌడ్ నేతృత్వంలో, బీఆర్ఎస్ నాయకులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన, ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు, వివిధ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై, ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని ప్రజలకు న్యాయం చేయాలని వినతిపత్రంలో కోరారు. అనంతరం అసెంబ్లీకి నల్లచొక్కాలతో వెళ్లేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మర్రిగూడ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. దీనితో కొద్దిసేపు చౌరస్తాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పల్లె రవికుమార్ గౌడ్ మాట్లాడుతూ.. మహిళా శాసన సభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు, దుశ్శాసన పర్వాన్ని తలపిస్తోందని విమర్శించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేస్తోందని ఆరోపించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు తెలిపే హక్కును ప్రభుత్వం గౌరవించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ప్రజలకు హామీలు ఇవ్వడం మాత్రమే కాకుండా, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినప్పటికీ అనేక హామీలు ఇంకా పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలు, ఇతర ఎన్నికల హామీల అమలుపై ప్రజలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజావాణి ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన సమస్యలను అధికారులు సంబంధిత శాఖలకు పంపించి, త్వరితగతిన పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి వారి సమస్యలకు పరిష్కారం చూపే వరకు, ప్రజల తరుపున తమ పోరాటాన్ని కొనసాగిస్తామని పల్లె రవికుమార్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, సర్పంచ్‌లు వల్లంల సంతోష్ యాదవ్, రొక్కం భాస్కర్ రెడ్డి, సీతారామ్ నాయక్, మాజీ ఎంపీపీ కట్కూరి వెంకటేష్ గౌడ్, మాజీ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, మండల నాయకులు ఆయిలి నర్సింహా గౌడ్, ఊరిపక్క నగేష్, నల్ల యాదయ్య, మునుగాల అంతిరెడ్డి, సురేందర్ రెడ్డి, మారగోని రామన్న, కోలుకులపల్లి యాదయ్య, కుంభం మాధవరెడ్డి, ఎడ్ల శ్రీరాములు, బడేటి జంగయ్య, లోడ యాదయ్య, గంట రవి, వల్లపు సైదులు, రాపోలు యాదగిరి, ఏనుగుల సత్తిరెడ్డి, కొంపల్లి నాగరాజు గౌడ్, ముత్తు, చాంద్ పాషా, లూర్ధయ్య, వనమాల మహేష్, కుక్కల మహేందర్, మట్టిపల్లి నర్సింహా తదితరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# శివన్నగూడెంలో ఘనంగా మాలల ముత్యాలమ్మ బోనాలు

### పోతరాజుల విన్యాసాలు.. డీజే చప్పుళ్లు.. మహిళల బోనాలతో సందడి

**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** మండలంలోని శివన్నగూడెం గ్రామంలో మాల సామాజిక వర్గీయుల ఆధ్వర్యంలో, ముత్యాలమ్మ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి బోనం సమర్పించేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో, గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సంప్రదాయ ఆచారాలు, భక్తి భావంతో నిర్వహించిన ఈ వేడుకలు గ్రామ ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచే మహిళలు బోనాలను ప్రత్యేకంగా అలంకరించుకుని, తలపై ఎత్తుకుని ముత్యాలమ్మ ఆలయం వైపు భక్తిశ్రద్ధలతో తరలివెళ్లారు. డీజే చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలతో గ్రామ వీధులు మార్మోగాయి. మహిళలు బోనాలతో ముందుకు సాగుతుండగా యువత, చిన్నారులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. రంగురంగుల బోనాలు, పసుపు-కుంకుమల అలంకరణలతో, పండుగ వాతావరణం మరింత శోభాయమానంగా మారింది. అమ్మవారికి బోనాలు సమర్పించిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామంలో ఎలాంటి ఆపదలు, అనారోగ్యాలు లేకుండా అమ్మవారి కృప ఉండాలని కోరుకున్నారు. తరతరాలుగా వస్తున్న బోనాల సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, యువత సైతం ఉత్సాహంగా పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముత్యాలమ్మ బోనాల సందర్భంగా శివన్నగూడెం గ్రామం భక్తులతో సందడిగా మారింది. కుటుంబ సమేతంగా వేడుకలకు హాజరైన ప్రజలు, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. పండుగను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించారు. ఈ కార్యక్రమంలో సుమన్, నరసింహ, వెంకటయ్య, యాదయ్య, రాములు, రవి, అబ్బయ్య, రాజు, వంశీ, సాయి తదితరులు పాల్గొని బోనాల వేడుకలను విజయవంతం చేశారు.

# విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరం

### వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా

### పరిగి జోన్ స్థాయి ఎస్ జి ఎఫ్ అండర్ 14 ,17 బాలికల వాలీబాల్ టోర్నమెంట్ ను ప్రారంభించిన ఎస్పీ






క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా సూచించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని సాల్వీడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరిగి జోన్ స్థాయి ఎస్ జి ఎఫ్ అండర్ 14 17 బాలికల టోర్నమెంటును మంగళవారం వారు ప్రారంభించారు. క్రీడలలో పాల్గొంటున్న క్రీడాకారులను పరిచయం చేసుకుని టోర్నమెంటును ప్రారంభించి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ టోర్నమెంట్ కు ముఖ్యఅతిథిగా వారు హాజరై క్రీడలను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, క్రీడలు జీవితంలో ఎంతో ముఖ్యమైనవి అని క్రీడల ద్వారా శరీరకదా ఆరోగ్యం విజ్ఞేశ్ తో పాటు క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం ఒక జట్టుగా పనిచేసే స్ఫూర్తి పెంపొందిస్తాయని ఆమె తెలిపారు. క్రీడలలో గెలుపు ఓటములు జీవితంలో ఎన్నో విలువైన పాటలను నేర్పుతాయని ఓటమి గెలుపు నాకు తొలి అడుగని, ఓటమితో నిరుత్సాహ పడకుండా వాటి నుంచి పాఠాలు నేర్చుకొని మరింత పట్టుదలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థికి జీవితంలో ఒక లక్ష్యం అనేది ఉండాలని ఆ లక్ష్యాన్ని సాధించేందుకు స్పష్టమైన గమ్యాలను ఏర్పాటు చేసుకొని కష్టపడి పని చేయాలని, విద్యార్థులు క్రీడల్లో ప్రతిపను చాటుతూ జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలలో రాణించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో పరిగి డీఎస్పీ ఎస్ శ్రీనివాసులు, సి ఐ కే. కొండల్ రెడ్డి, కుల్కచర్ల ఎస్సై వి రమేష్ కుమార్, ఎంఈఓ జైపాల్ రెడ్డి, కుల్కచర్ల పిఎసిఎస్ చైర్మన్ బొలుసని భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు, సాల్వీడు గ్రామ సర్పంచ్ లక్ష్మమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులు విద్యార్థులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

### ప్రశాంత వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలి



**భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 08:** ప్రజలందరూ గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో, శాంతియుత ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. ఉత్సవాల సందర్భంగా ప్రజల భద్రత, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. గణేష్ మండపాల నిర్వాహకులు మండపం ఏర్పాటు చేయడానికి ముందుగానే పోలీసులకు సమాచారం అందించడంతో పాటు పోలీసు శాఖ రూపొందించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో మండపానికి సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా భద్రత, బందోబస్తు ఏర్పాట్లకు ఈ వివరాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

గణేష్ మండపాల ఆన్‌లైన్ నమోదు పోర్టల్:
http://policeportal.tspolice.gov.in/index.htm

ఆన్‌లైన్‌లో మండప వివరాలను నమోదు చేసి, అనంతరం దరఖాస్తు వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని సూచించారు. మండపాలను ప్రధాన రహదారులు, ప్రజా రవాణా మార్గాలు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించే విధంగా ఏర్పాటు చేయరాదన్నారు. విద్యుత్ శాఖ అనుమతులతోనే విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, 24 గంటలు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. గణేష్ మండపాలకు జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా డీజేలకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. పోలీసుల అనుమతితో నిబంధనలకు లోబడి పరిమిత శబ్దంతో స్పీకర్లు మాత్రమే వినియోగించాలని, రాత్రి 10 గంటల తర్వాత లౌడ్‌స్పీకర్లు వినియోగించరాదని తెలిపారు. చిన్నారులు, వృద్ధులు తదితరులకు ఇబ్బంది కలిగించే విధంగా పరిమితికి మించి శబ్దాలు వినియోగించరాదన్నారు. నిమజ్జనం సందర్భంగా పోలీసుల సూచనలు, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. నిర్ణీత సమయాల్లోనే నిమజ్జన శోభాయాత్ర నిర్వహిస్తూ ప్రజలు, ఇతర వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. శోభాయాత్రలో టపాసులు పేల్చడం, డీజేలు ఏర్పాటు చేయడం నిషేధమని తెలిపారు. శోభాయాత్రలో పాల్గొనే వారు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే విధంగా వాహనాలను రహదారులపై నిలిపివేయరాదని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పోలీసుల సూచనలను పాటిస్తూ సహకరించాలని కోరారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లు, సమస్యాత్మక వ్యక్తులపై పోలీసుల నిరంతర నిఘా ఉంటుందని ఎస్పీ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు అనుమానాస్పదంగా ఎవరైనా వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తూ పోలీసు శాఖకు ప్రజలు, మండపాల నిర్వాహకులు సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.



# మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు రంగారెడ్డి జిల్లా మాదిగ మహిళా కమిటీ ఎన్నిక....



క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి : మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాదిగ మహిళా సమైక్య సమావేశం జరిగింది.

ఎంఎస్ఎస్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నపూర్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాదిగ మహిళా కోర్ కమిటీ చైర్మన్ చౌటపల్లి విజయ, ఎంఎంఎం జాతీయ అధ్యక్షురాలు జెపి లతా మాదిగ, ఎంఎంఎం రాష్ట్ర అధ్యక్షురాలు రజియా హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా నూతన మహిళా కమిటీని ఏకగ్రీవంగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గా ఎం. వరలక్ష్మి, శేరిలింగంపల్లి మండల అధ్యక్షురాలు గా బాబితా, కొండాపూర్ డివిజన్ అధ్యక్షురాలు గా కళ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు...

# మహిళా ఎమ్మెల్యేలపై అసభ్య ప్రవర్తనకు నిరసన....

### చందానగర్‌లో కళ్లకు గంతలు కట్టుకుని వినూత్న ఆందోళన....



క్రైమ్ మిర్రర్ చందానగర్: అసెంబ్లీలో సీనియర్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల సీఎం వ్యవహరించిన తీరును నిరసిస్తూ చందానగర్‌లో బీఆర్ఎస్ నాయకురాలు బొబ్బా నవతారెడ్డి ఆధ్వర్యంలో మహిళలు నిరసన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహిళా లోకానికి సీఎం రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, శభన, శరీన్ తదితర మహిళా నాయకులు, సీనియర్ నాయకులు కోమండ్ల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాక్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో హర్యానా జయభేరి

### నర్సాపూర్‌లో హోరాహోరీ పోటీలు!



నర్సాపూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 08: నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో అజయ్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ సీనియర్ నేషనల్, 7వ సీనియర్ మిక్స్‌డ్ నేషనల్ రాక్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా సాగాయి. సీనియర్ బాయ్స్ విభాగంలో హర్యానా జట్టు విజేతగా నిలవగా, ఉత్తరప్రదేశ్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. సీనియర్ మిక్స్‌డ్ విభాగంలోనూ హర్యానా జట్టు ఛాంపియన్‌గా నిలవగా, తెలంగాణ జట్టు రన్నరప్‌గా నిలిచింది. మహిళల రాక్‌బాల్ విభాగంలో హర్యానా జట్టు విజయం సాధించింది. ఈ ఛాంపియన్‌షిప్ కార్యక్రమానికి మెదక్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ రాజమణి యాదవ్, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజు యాదవ్, వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ సాయికుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరారెడ్డి, నర్సాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ రంజిత్‌రెడ్డి, బీవీఆర్ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ బాపిరాజు, సురేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, నర్సాపూర్ నియోజకవర్గ నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు. క్రీడాకారులను నిర్వాహకులు అభినందిస్తూ, జాతీయ స్థాయి పోటీలకు నర్సాపూర్ వేదిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు.

# ఆలయ అభివృద్ధికి అడ్డంకులు వద్దు : దొడ్ల అశోక్

## కాళేశ్వరం అభివృద్ధిని ఓర్వలేక దుష్ప్రచారమా?

## అభివృద్ధి పనులపై మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక శ్రద్ధ

## వాస్తవాలను తెలుసుకోకుండా రాజకీయ విమర్శలు : అశోక్



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కాళేశ్వరం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయానికి మహర్దశ పట్టిందని ఆలయ డైరెక్టర్ అశోక్ అన్నారు. ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించి పనులను ముందుకు తీసుకెళ్తున్న నేపథ్యంలో, కొందరు రాజకీయ నాయకులు వాస్తవాలను పక్కనపెట్టి దుష్ప్రచారం చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం క్షేత్రానికి ఉన్న ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అశోక్ తెలిపారు. ముఖ్యంగా స్థానిక మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కాళేశ్వరం ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేశారని చెప్పారు.

**రూ.198 కోట్లతో భారీ అభివృద్ధి పనులు..**

కాళేశ్వరం ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.198 కోట్ల నిధులు కేటాయించిందని అశోక్ తెలిపారు. ప్రధాన ఆలయ నిర్మాణంతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆలయ ప్రాంగణాన్ని విస్తరించడం, క్యూ కాంప్లెక్స్, పరిపాలనా భవనం తదితర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే దిశగా పనులు సాగుతున్నాయని వివరించారు. పాత నిర్మాణాల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామని, ప్రస్తుతం పాత నిర్మాణాల తొలగింపు ప్రక్రియ పూర్తయి కొత్త నిర్మాణాలకు మార్గం సుగమమైందని ఆయన తెలిపారు.

**మంత్రి శ్రీధర్‌బాబు కృషి అభినందనీయం..**

కాళేశ్వరం ఆలయ అభివృద్ధి విషయంలో మంత్రి శ్రీధర్‌బాబు చూపుతున్న చొరవ అభినందనీయమని అశోక్ అన్నారు. కాళేశ్వరం కేవలం ఒక ఆలయం మాత్రమే కాదని, లక్షలాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన పుణ్యక్షేత్రమని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి జరిగితే దాని ప్రభావం కాళేశ్వరం గ్రామంపై కూడా ఉంటుందని, భక్తుల రాక పెరగడంతో స్థానిక వ్యాపారులు, చిరు వ్యాపారులు, హోటళ్లు, రవాణా రంగం తదితరాలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఆలయ అభివృద్ధితో పాటు క్షేత్ర పరిసర ప్రాంతాల అభివృద్ధి కూడా వేగం పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**అభివృద్ధిని అడ్డుకోవడం ఎవరికీ ప్రయోజనం కాదు**

ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను స్వాగతించాల్సింది పోయి రాజకీయ విమర్శలు చేయడం, ప్రజల్లో అపోహలు సృష్టించడం వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదని అశోక్ అన్నారు. ఆలయ పునర్నిర్మాణం అనేది భక్తుల సౌకర్యం, క్షేత్ర అభివృద్ధి, భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేపడుతున్న కార్యక్రమమని తెలిపారు. విమర్శలు చేసే వారు ఒకసారి జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా పరిశీలించి వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు.

**పుష్కరాల నాటికి కొత్త రూపు..!!**

వచ్చే గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు అధికారులు ఇప్పటికే స్పష్టం చేశారు. పనుల్లో నాణ్యతకు ఎలాంటి రాజీ లేకుండా, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇటీవల అధికారులను ఆదేశించారు. కాళేశ్వరం క్షేత్రాన్ని భవిష్యత్‌లో మరింత గొప్ప ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అశోక్ తెలిపారు. ఆలయ అభివృద్ధి పూర్తయిన తర్వాత కాళేశ్వరం రూపురేఖలు పూర్తిగా మారుతాయని, భక్తులకు మరింత మెరుగైన దర్శన సౌకర్యాలు, మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

**దుష్ప్రచారంతో అభివృద్ధిని ఆపలేరు : అశోక్**

కాళేశ్వరం అభివృద్ధి విషయంలో రాజకీయ విమర్శలు, ఆరోపణలు ఎన్ని వచ్చినా పనులు ఆగబోవని అశోక్ స్పష్టం చేశారు. క్షేత్ర అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరూ నిర్మాణ పనులకు సహకరించాలని కోరారు. కాళేశ్వరం అభివృద్ధి అనేది రాజకీయాలకు అతీతమైన అంశమని, ఇది భక్తుల విశ్వాసం మరియు ప్రాంత భవిష్యత్తుతో ముడిపడి ఉందని ఆయన అన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు భక్తులు, స్థానిక ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.



# బిఆర్ఎస్ పార్టీ నాయకులను అక్రమంగా అరెస్టు చేసిన పోలీసులు

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: తెలంగాణ శాసనసభ సమావేశాల సందర్భంగా శాసనసభకు వెళ్లి బిఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపడతారని ఉద్దేశం చేత కుల్కచర్ల పోలీసులు బిఆర్ఎస్ పార్టీ నాయకులను మంగళవారం తెల్లవారుజాముని ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో రైతు సమన్వయ సమితి మండల మాజీ అధ్యక్షులు కేబి రాజు, మండల ఎంపీటీసీల పురం మాజీ అధ్యక్షులు మాలే కృష్ణయ్య గౌడ్, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం రాములు, గుండుమల్ల నరసింహులు, గేదుల సత్తయ్య, కుల్కచర్ల గ్రామ వార్డు సభ్యులు శివ్వని ఎల్లయ్య, కాటంపల్లి అంజిలయ్య, జట్టిగళ్ల వెంకటయ్య,పి.నర్సింలు, చెన్నయ్య పుల్లయ్ శ్రీను ఎండి రుక్మాదిన్, మొగులయ్య కృష్ణయ్య రామచంద్రయ్య తదితరులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు.

# విద్యా సంస్థల్లో అగ్నిమాపక భద్రత తప్పనిసరి

## ఫైర్ ఎన్‌ఓసీలపై అవగాహన సమావేశం





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** విద్యా సంస్థల్లో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డీజీ విక్రమ్ సింగ్ మాన్ ఐపీఎస్ సూచించారు. హైదరాబాద్‌లోని ఫైర్ సర్వీసెస్ డీజీ కార్యాలయంలో విద్యా సంస్థలు, ఇతర భాగస్వామ్య వర్గాలతో ఫైర్ సేఫ్టీ, ఫైర్ ఎన్‌ఓసీల విధానాలపై పరస్పర చర్చా సమావేశం నిర్వహించారు. విద్యార్థులు, బోధనా--బోధనేతర సిబ్బంది భద్రతకు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో సమర్థవంతమైన ఫైర్ సేఫ్టీ వ్యవస్థలు అందుబాటులో ఉండాలని డీజీ స్పష్టం చేశారు. అగ్నిమాపక పరికరాల నిర్వహణ, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సన్నద్ధత, సురక్షితంగా బయటకు వెళ్లే మార్గాలు తదితర అంశాలపై ఆయన వివరించారు. సుమారు 30 మంది విద్యా సంస్థల ప్రతినిధులు సమావేశంలో పాల్గొని ఫైర్ ఎన్‌ఓసీ విధానాలు, భద్రతా నిబంధనల అమలు, ఇప్పటికే నిర్మించిన భవనాల్లో ఎదురయ్యే ఆచరణాత్మక సమస్యలపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా తనిఖీల్లో ఏకరీతి విధానం కోసం ప్రత్యేక చెక్‌లిస్ట్ రూపొందించాల్సిన అవసరంపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. ఇప్పటికే కొనసాగుతున్న పాఠశాలలు, జూనియర్ కళాశాలల కోసం ఆచరణాత్మక చెక్‌లిస్ట్‌ను త్వరలో ఫైర్ శాఖ జారీ చేస్తుందని డీజీ తెలిపారు. ఫైర్ ఎన్‌ఓసీలు ఇప్పిస్తామని చెప్పే అనధికారిక వ్యక్తులను నమ్మవద్దని, నకిలీ లేదా అనధికారిక ఎన్‌ఓసీలతో చట్టపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ విద్యా సంస్థలను నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఫైర్ అధికారులు, అసిస్టెంట్ జిల్లా ఫైర్ అధికారులు, పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# కాటేదాన్‌లో బీఆర్ఎస్ నేత ఇంటి వద్ద పోలీసుల మోహరింపు

## సబితా ఇంద్రారెడ్డి ఘటనకు నిరసనగా బీఆర్ఎస్ ధర్నాలు

## అరెస్టులతో తమ గొంతు నొక్కలేరంటూ బీఆర్ఎస్ నేతల హెచ్చరిక





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విషయంలో జరిగిన ఘటనకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చిన ధర్నాల నేపథ్యంలో కాటేదాన్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఇందులో భాగంగా కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ నివాసానికి పోలీసులు చేరుకోవడంపై పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. వెంకటేష్ ఇంట్లో లేరని కుటుంబ సభ్యులు పోలీసులకు స్పష్టంగా చెప్పినప్పటికీ, పోలీసులు ఆయన నివాసం వద్దే ఉండిపోయారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. దీంతో కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొనడంతో పాటు, ఇంటి పరిసరాల్లో భయానక వాతావరణం ఏర్పడిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై ఒత్తిడి తీసుకురావడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించే హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. “కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్ నిరసనలంటే ఎందుకింత భయం?” అని ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతలు.. పోలీసుల ద్వారా అరెస్టులు, నిర్బంధాలతో పార్టీ నాయకుల గొంతు నొక్కలేరని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతూనే ఉంటామని బీఆర్ఎస్ నాయకులు ప్రకటించారు. ఎలాంటి ఒత్తిళ్లు ఎదురైనా ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. వెంకటేష్ నివాసం వద్ద పోలీసుల మోహరింపుపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవ పరిస్థితిని వెల్లడించాలని వారు కోరారు.

# శ్రీ రాధాకృష్ణ ఆలయ క్షేత్రం అభివృద్ధికి గ్రానైట్ విరాళం

## దాత మణిదీప్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఆర్. నరేష్ కుమార్

**క్రైమ్ మిర్రర్ -- శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మున్సిపాలిటీ, సెప్టెంబర్ 9: సనాతన కృష్ణగిరి పాదాల గుట్టలోని శ్రీ రాధాకృష్ణ ఆలయ క్షేత్రం అభివృద్ధికి సహకారం అందించిన దాత శ్రీ మణిదీప్కు భాజపా ఎండోమెంట్స్ సెల్ ధార్మిక రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్, శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్. నరేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఆలయం చుట్టూ సుమారు 800 చదరపు అడుగుల రెడ్ గ్రానైట్‌ను మణిదీప్ ఉచితంగా అందించారని నరేష్ కుమార్ తెలిపారు. పురాతన హిందూ ఆలయాల అభివృద్ధి, పరిరక్షణకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా దాత మణిదీప్ మాట్లాడుతూ.. చందిప్ప మరకత శివలింగం, గుబ్బడి పత్తేపురం కృష్ణగిరి పాదాల గుట్ట వంటి పురాతన ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధికి నరేష్ కుమార్ చేస్తున్న సేవలను అభినందిస్తూ తాను ఈ సహాయానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. సనాతన ధర్మ క్షేత్రాల అభివృద్ధికి నరేష్ కుమార్ చేస్తున్న కృషికి భాజపా ఎండోమెంట్స్ సెల్ ధార్మిక స్టేట్ కన్వీనర్ అన్నవజ్జుల సూర్య ప్రకాశ్ రావు, కో-కన్వీనర్ నిరంజన్ దేశాయి అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని నరేష్ కుమార్ పేర్కొన్నారు. వారి సహకారంతో మరిన్ని పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.




# గోపులారం మాజీ సర్పంచ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి

**క్రైమ్ మిర్రర్ -- శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మండలం గోపులారం గ్రామ మాజీ సర్పంచ్ పొడువు శ్రీనివాస్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు శంకర్‌పల్లి మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం ప్రశాంత్ రెడ్డి హాజరై శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ప్రజా జీవితంలో మరింతగా సేవలందిస్తూ అందరి ఆదరాభిమానాలు పొందాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాపిరెడ్డిగారి , రఘునందన్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొని పొడువు శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కల్మెట్ తండా తొలి ఇంజనీర్‌కు ఘన సన్మానం

## కల్మెట్ తండా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఏర్పాటు

## నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

## అధ్యక్షులు రూపావత్ కిషన్ నాయక్,ప్రధాన కార్యదర్శి, భూక్య శ్రీనివాసరావు




**క్రైమ్ మిర్రర్,పాలకీడు :** మారుమూల గిరిజన గ్రామమైన కల్మెట్ తండాకు చెందిన భూక్య రాము నాయక్ భారతీయ రైల్వేలో 35 సంవత్సరాలపాటు విశిష్ట సేవలందించి డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ హోదాలో పదవీ విరమణ చేసిన సందర్భంగా కల్మెట్ తండా ఉద్యోగులు ఆయనకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, ఉద్యోగుల పరస్పర సహకారం మరియు విద్యా ప్రోత్సాహం లక్ష్యంగా కల్మెట్ తండా ఉద్యోగుల సంక్షేమ సంఘం ను ఏర్పాటు చేశారు. సభ్యులందరి ఏకగ్రీవ ఆమోదంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులు రూపావత్ కిషన్ నాయక్,ప్రధాన కార్యదర్శి, భూక్య శ్రీనివాసరావు ,కోశాధికారి రూపావత్ గబ్రు నాయక్ ,ప్రధాన సలహాదారులు భూక్య రాము నాయక్ ,రూపావత్ దస్రు నాయక్ ,అసోసియేట్ ప్రెసిడెంట్ , సైదా నాయక్ ఉపాధ్యక్షులు ఆర్. మంగ్యా నాయక్,మహిళా కార్యదర్శి భూక్య సంధ్యాఆర్గనైజింగ్ సెక్రటరీలు, రూపావత్ రంగయ్య నాయక్,బి. నాగేశ్వరరావు నాయక్,ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, ఆర్. గోప నాయక్, భూక్య సైదా నాయక్, బి. ఉమ, నరసింహ నాయక్ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నగారా శంకర్, భూక్య రమేష్, భూక్య నాగ, రూపావత్ సీతారాం, రూపావత్ మంచ, దిరావత్ నాగు, రూపావత్ విజయ, భూక్య బుజ్జి, రూపావత్ స్వర్ణ, రూపావత్ కిషన్ తదితరులు పాల్గొని నూతన సంఘానికి శుభాకాంక్షలు తెలిపారు. తండా అభివృద్ధి,ఉద్యోగుల ఐక్యత, యువత భవిష్యత్తు అనే లక్ష్యంతో సంఘం పనిచేస్తుందని నూతన కమిటీ ప్రకటించింది.

# బద్దం సురేందర్ రెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

## బైక్ అదుపుతప్పి ఫార్చునర్ కారును ఢీకొని యువకుడి మృతి



**క్రైమ్ మిర్రర్ శంకర్‌పల్లి,:** శంకర్‌పల్లి పట్టణ పరిధిలోని బద్దం సురేందర్ రెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 19 ఏళ్ల యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అందించిన ఫిర్యాదు ప్రకారం.. చిన్న శంకర్‌పల్లికి చెందిన నిశ్వంత్ (19) తన స్నేహితుడు కంటేష్‌తో కలిసి మంగళవారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో బైక్‌పై శంకర్‌పల్లి నుంచి బద్దం సురేందర్ రెడ్డి గార్డెన్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గార్డెన్ సమీపంలో ఆగి ఉన్న ఫార్చునర్ కారును బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న నిశ్వంత్‌కు తీవ్ర గాయాలు కాగా, అతడిని వెంటనే మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నిశ్వంత్ మృతి చెందినట్లు సమాచారం. అదేవిధంగా బైక్‌పై వెనుక కూర్చున్న అతని స్నేహితుడు కంటేష్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. అతడికి ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం

# దేవస్థానానికి ఇబ్బంది కలగకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలి

## పాత సీసీ రోడ్డు తొలగించి కొత్త రోడ్డు వేయాలని అధికారులకు ధర్మకర్తల మండలి వినతి

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శ్రీ శివాంజనేయ స్వామి దేవస్థానం సమీపంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను నిబంధనల ప్రకారం చేపట్టాలని కోరుతూ దేవస్థాన ధర్మకర్తల మండలి అధికారులు దృష్టికి తీసుకెళ్లింది. కాంట్రాక్టర్ తన ఇష్టానుసారంగా రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని, దీంతో దేవస్థానానికి భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ధర్మకర్తల మండలి పేర్కొంది. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ మున్సిపాలిటీతో పాటు డిప్యూటీ కమిషనర్, రాజేంద్రనగర్ మున్సిపాలిటీ అధికారులను కిస్మత్‌పూర్‌లో కలిసి పరిస్థితిని వివరించారు. ప్రస్తుతం ఉన్న పాత సీసీ రోడ్డును తొలగించి, సరైన స్థాయిలో కొత్త రోడ్డును నిర్మించాలని కోరారు. పాత రోడ్డును తొలగించకుండా దానిపైనే కొత్త రోడ్డు వేస్తే దేవస్థానం రోడ్డు స్థాయి కంటే కిందికి వెళ్లే



పరిస్థితి ఏర్పడుతుందని ధర్మకర్తల మండలి ఆందోళన వ్యక్తం చేసింది. దీంతో దేవస్థానంలో పూజా కార్యక్రమాలకు ఇబ్బందులు ఏర్పడటంతో పాటు, వర్షాలు కురిసిన సమయంలో బయట నుంచి మురుగునీరు, చెత్తాచెదారం దేవస్థానంలోకి చేరే ప్రమాదం ఉందని పేర్కొంది. అలాగే రోడ్డుపై పేరుకుపోయే మట్టి, చెత్త తదితరాలు దేవస్థానం ప్రాంగణంలోకి చేరే అవకాశం ఉందని, భక్తులకు కూడా ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. దేవస్థానం పవిత్రత, భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్డు నిర్మాణాన్ని శాస్త్రీయంగా, సరైన ఎత్తు-పల్లాలతో చేపట్టాలని అధికారులను కోరారు. పాత సీసీ రోడ్డును పూర్తిగా తొలగించి, అవసరమైన స్థాయిని నిర్ధారించిన అనంతరం నాణ్యమైన కొత్త రోడ్డు నిర్మించాలని ధర్మకర్తల మండలి అధికారులకు విజ్ఞప్తి చేసింది. దేవస్థానానికి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, కాంట్రాక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

# తెలంగాణలో బీఆర్ఎస్ విజయ డంకా ఖాయం- కార్తీక్ రెడ్డి

## గండిపేటలో బీఆర్ఎస్ సమరభేరి -- ఖానాపూర్ నుంచి భారీ ర్యాలీ

### కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని వ్యాఖ్య

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయ డంకం మోగించడం ఖాయమని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి కనిపించడం లేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ చేపడుతున్న వరుస నిరసన కార్యక్రమాల్లో భాగంగా నార్సింగి సర్కిల్ గండిపేట ఖానాపూర్‌లో సమరభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్తీక్ రెడ్డి, నార్సింగి సర్కిల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కే. విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఖానాపూర్ చౌరస్తా నుంచి గండిపేట వరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో పెద్ద ఎత్తున వ్యతిరేకత నెలకొందని అన్నారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు ప్రయత్నిస్తున్న ప్రతిపక్ష



ఎమ్మెల్యేలను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. మాజీ మంత్రులు, ప్రస్తుత ఎమ్మెల్యేల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. మాజీ హోంమంత్రి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పట్ల అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న పరిణామాలను కార్తీక్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. మహిళా ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవడం సరికాదని అన్నారు. "ఇంద్రారెడ్డి కుటుంబం భయపెట్టే రకం.. భయపడే రకం కాదు. ఆట ఇంకా మొదలు కాలేదు" అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కార్తీక్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేల గొంతు నొక్కే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజల్లో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను ఎవరూ అడ్డుకోలేరని ఆయన అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పార్టీకి ప్రజల మద్దతు లభించి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ అధ్యక్షుడు ముక్తార్, నిజాముద్దీన్, రవి యాదవ్, పెద్దపులి కిషన్, గణేష్ ముదిరాజ్, శ్రీకాంత్ రెడ్డి, వెంకటేష్, మల్లేష్, మాజీ ఎంపీటీసీ వెంకటేష్, చిరంజీవి, లక్ష్మి, జైసీమ, జయ, విట్టల్ రెడ్డి, రాజు, క్రాంతి యాదవ్, అనిసా బేగం, అరుణ, శ్రీదేవి, భూదేవి, ఈశ్వరి, కార్తీక్, వంశీ, అభిలాష్, ప్రకాష్, మహేందర్, సంతోష్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో 1.33 లక్షల మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

### 9 నుంచి 13 వరకు 34 ప్రాంతాల్లో ఉచితంగా పంపిణీ

హైదరాబాద్(క్రైమ్ మిర్రర్): పర్యావరణ పరిరక్షణలో భాగంగా హెచ్ఎండిఎ ఆధ్వర్యంలో ఈ ఏడాది కూడా ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినియోగాన్ని తగ్గించి, పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లోని 34 ప్రాంతాల్లో మొత్తం 1,33,000 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నారు. ఇందులో 8 అంగుళాల పరిమాణంలో 80,000, ఒక అడుగు పరిమాణంలో 53,000 విగ్రహాలు ఉన్నాయి. సెప్టెంబర్ 9 నుంచి 13 వరకు వివిధ పంపిణీ కేంద్రాల్లో ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉంటాయి. మట్టి విగ్రహాలు నీటిలో నిమజ్జనం చేసినా నీటి నాణ్యతపై హానికర ప్రభావం తక్కువగా ఉండటంతో పర్యావరణహిత గణేశ్ విగ్రహాల వినియోగాన్ని హెచ్ఎండిఎ ప్రోత్సహిస్తోంది. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ రహిత వినియోగంపై అవగాహన పెంచడం కూడా కార్యక్రమ లక్ష్యంగా పేర్కొన్నారు. జూబ్లీహిల్స్, మెహదీపట్నం, కెబిఆర్ పార్క్, బేగంపేట, సోమాజిగూడ, బాల్కంపేట, కోత్వాల్‌గూడ ఎకో పార్క్, శిల్పారామం--హైటెక్ సిటీ, కూకట్‌పల్లి, ఉప్పల్, సికింద్రాబాద్, ట్యాంక్‌బండ్, సచివాలయం, ఎన్టీఆర్ గార్డెన్స్, సరూర్‌నగర్, వనస్థలిపురం, దుర్గం చెరువు, నారాయణగూడ, మాదాపూర్, తార్నాక, బండ్లగూడ--నాగోల్, తెలంగాణ హైకోర్టు తదితర ప్రాంతాల్లో పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా కొన్ని గేటెడ్ కమ్యూనిటీలు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల వద్ద మొబైల్ పంపిణీ కార్యక్రమం కూడా నిర్వహించనున్నారు. పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను వినియోగించి గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలని హెచ్ఎండిఎ ప్రజలకు సూచించింది.

# మోకిల నుంచి శంకర్‌పల్లి వరకు సబర్బన్ బస్సు సర్వీస్ కొనసాగించాలి

### సేవా ఫౌండేషన్ విజ్ఞప్తికి స్పందన.. ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి నరేష్ కుమార్ కృతజ్ఞతలు

**క్రైమ్ మిర్రర్ -- శంకర్‌పల్లి:** మోకిల నుంచి శంకర్‌పల్లి వరకు సబర్బన్ బస్సు సర్వీస్‌ను కొనసాగించాలంటూ శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్. నరేష్ కుమార్ (సతీష్ కుమార్) చేసిన విజ్ఞప్తికి స్పందన లభించింది. ఈ సమస్యను పత్రికల ద్వారా వెలుగులోకి తీసుకురావడంతో పాటు, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు పగడాల ప్రసాద్కు వాట్సాప్ ద్వారా లేఖ పంపారు.గత 30 సంవత్సరాలుగా మోకిల వరకు వస్తున్న సబర్బన్ బస్సు సర్వీస్ శంకర్‌పల్లి వరకు అందుబాటులో లేకపోవడంతో మండలంలోని విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నరేష్ కుమార్ తన లేఖలో వివరించారు.ఈ విజ్ఞప్తిపై స్పందించిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు పీఏ పగడాల ప్రసాద్ మంగళవారం తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్కు లేఖ రాశారు. వీలైనంత త్వరగా మోకిల నుంచి శంకర్‌పల్లి వరకు హైదరాబాద్ సబర్బన్ బస్సు సర్వీస్‌ను నడిపించి ప్రయాణికుల ఇబ్బందులను పరిష్కరించాలని లేఖలో కోరారు.అదేవిధంగా చేవెళ్ల మార్గంలో ఉన్న తోల్కట్ట గ్రామానికి కూడా బస్సు సర్వీసులు అందుబాటులోకి తీసుకురావాలని రవాణా శాఖ మంత్రిని కోరినట్లు తెలిపారు.తమ సమస్యపై స్పందించి రవాణా మంత్రికి లేఖ రాయించిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, పీఏ పగడాల ప్రసాద్కు శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. సమస్యను పత్రికల ద్వారా ప్రజల దృష్టికి తీసుకెళ్లిన విలేకరులకు కూడా ఆయన అభినందనలు తెలిపారు.సేవా ఫౌండేషన్ చేసిన ప్రయత్నాన్ని విద్యార్థులు, ఉద్యోగస్తులు, ప్రయాణికులు అభినందిస్తున్నారని నరేష్ కుమార్ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమ ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై నిరసన



గండిపేట(క్రైమ్ మిర్రర్): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రభుత్వం 1000 రోజుల పాలనను పూర్తి చేసిందని ఆరోపిస్తూ గత వారం రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు. ప్రభుత్వ పాలనలోని వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం నెక్నంపుర్ పాఠశాల వద్ద ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి నాయకులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసేందుకు ప్రయత్నించినప్పటికీ ఆయన అందుబాటులో లేకపోవడంతో కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, రామ్‌బాబు నాయక్‌లను స్థానిక నాయకులు కలిశారు. పుప్పలగూడలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరుతో ప్రతిపాదించిన కమ్యూనిటీ హాల్ అంశంపై కమిషన్ సభ్యులతో నాయకులు చర్చించారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన సమస్యలు, స్థానిక ప్రజల అవసరాలను వారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాల్‌ను అభివృద్ధి చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్‌రావు, షకీలా రెడ్డి, యాలాల కిరణ్, ఆరిఫ్ మహమ్మద్, సుమనళిని, జయరాం, షేక్ ఆరిఫ్, భానుచందర్, బాబురావు, మంజుల తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని నాయకులు తెలిపారు.

# వెండికొండ సిద్ధేశ్వర సిద్దులగుట్ట జాతరలో ప్రత్యేక పూజలు

### పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్‌రెడ్డి

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని శంషాబాద్ వెండికొండ సిద్ధేశ్వర సిద్దులగుట్ట స్వామివారి జాతర చివరి రోజు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి స్థానిక బీజేపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించిన తోకల శ్రీనివాస్‌రెడ్డి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు, పెద్దలు, భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాతరలో అవసరమైన ఏర్పాట్లు చేసిన కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. భగవంతుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎలాంటి విపత్తులు



సంభవించకుండా ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మున్సిపాలిటీ, మండలానికి చెందిన బీజేపీ ముఖ్య నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. నందీశ్వర్ పంతులు, బతుకు శ్రీనివాస్ యాదవ్, జగ్జీవన్‌రెడ్డి, కమలమ్మ, వీరేందర్‌రెడ్డి, ధన్పాల్‌రెడ్డి, బండి శ్రీకాంత్‌యాదవ్, నర్సింగ్ ముదిరాజ్, హర్షిత్‌రెడ్డి, సిద్ధు ముదిరాజ్, శివారెడ్డి, గిరి, శ్రీకాంత్, ప్రేమ్‌కుమార్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



# కెసిఆర్ పై అనుచిత వ్యాకలను ఖండిస్తున్నాం....

### షాద్ నగర్ ఎమ్మెల్యే పై మాదాపూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు...

క్రైమ్ మిర్రర్ మాదాపూర్: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ పార్టీ షాద్ నగర్ ఎమ్మెల్యే కె.శంకరయ్యపై చర్యలు తీసుకోవాలని మాదాపూర్ ఎస్ ఎచ్ ఓ కే వీ సుబ్బారావు కు మాదాపూర్ డివిజన్ బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు మాదాపూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మాదాపూర్ డివిజన్‌కు చెందిన ఉద్యమ నాయకులు సహదేవ్, కృష్ణ మాదిగ, లక్ష్మణ్, శ్రీనివాస్, అభినంద్, నరేంద్ర, నీలేష్, అఖిల్, చందూ తదితరులు పోలీసులను కలిసి ఫిర్యాదు అందజేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయనపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



# నేపాల్ వరదల్లో గల్లంతైన మణికొండ వాసి ధన్పాల్‌రెడ్డి

### బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

### ఆచూకీ కోసం అన్ని విధాలా కృషి చేస్తామని హామీ

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నేపాల్‌లో ఇటీవల సంభవించిన వరదల్లో మణికొండకు చెందిన ధన్పాల్‌రెడ్డి గల్లంతైన ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రీఛా టూర్స్ అండ్ ట్రావెల్స్ ద్వారా నేపాల్ యాత్రకు వెళ్లిన ధన్పాల్‌రెడ్డి వరద ప్రమాదంలో గల్లంతైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదం జరిగి రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఆయన ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఘటన విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మణికొండలోని ధన్పాల్‌రెడ్డి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆందోళనలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. ధన్పాల్‌రెడ్డి ఆచూకీ లభించే వరకు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ.. ధన్పాల్‌రెడ్డి ఆచూకీ కనుగొనేందుకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా కృషి చేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖతో పాటు నేపాల్ అధికారులతో సమన్వయం చేసుకుని గాలింపు చర్యలను వేగవంతం చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, ఈ క్లిష్ట సమయంలో వారికి అండగా ఉంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ధన్పాల్‌రెడ్డి క్షేమంగా తిరిగి రావాలని స్థానికులు, కుటుంబ సభ్యులు ఆకాంక్షిస్తున్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో పాటు గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, నార్సింగి మార్కెట్ చైర్మన్ వేణుగౌడ్, మణికొండ సర్కిల్ పార్టీ అధ్యక్షుడు శ్రీరామ్, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, శ్రవణ్ తదితరులు ధన్పాల్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు.


Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.